ప్రతి దినపత్రిక
# సూర్య


## కర్నూలు | నంద్యాల
బుధవారం | 13 డిసెంబర్ 2023 | పేజీలు 8

# జొహరాపురం మంచినీటి పంపుహౌస్‌కు తాళం

- నిలిచిపోయిన మంచినీటి సరఫరా


జొహరాపురం లో ఉన్న మంచినీటి పంపుహౌసు

**ఆలూరు, మేజర్‌న్యూస్ :** ఆలూరు నియోజకవర్గంలోని ఆస్పరి మండలం జొహరాపుం గ్రామానికి కొన్నేళ్లుగా మంచినీరు దొరకక వక్రేణి నీరు,పొలాల్లో గుంతలలో నిలిచిన నీరుతాగి జీవనం గడిపారు. అయితే ప్రభుత్వం వారికి లక్షలు ఖర్చు పెట్టి లక్షలలీటర్ల నిల్వతో మంచినీటి పంపుహౌసు నిర్మాణం చేపట్టారు. మంత్రి

మిగతా 2లో

## వ్యవసాయ అంశాలపై
# పార్లమెంట్‌లో ప్రశ్నించిన కర్నూలు ఎంపీ


కర్నూలు ఎంపీ సంజీవకుమార్

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** పార్లమెంటు శీతకాల సమావేశాల్లో కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవకుమార్ పార్లమెంటులో వ్యవసాయానికి సంబంధించిన పలు అంశాలపై మంగళవారం ప్రశ్నించారు. కేంద్ర మంత్రి అర్జున్‌ముండా ఎంపీ ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. పార్లమెంటులో ఎంపీ మాట్లాడుతూ ఉద్యానవన పంటలు మన వాటా వాస్తవాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించిందా, ప్రపంచ వాణిజ్యంలో భారతదేశం వాటా కూరగాయలు, పండ్లు ఒక శాతం మాత్రమే ఉందా ప్రశ్నించారు. దీనికి కేంద్రమంత్రి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల ప్రస్తుతం దేశంలో 351.92మిలియన్ టన్నుల ఉత్పత్తి చేస్తుందని, ప్రపంచ ఉత్పత్తిలో 11. 38శాతం వాటాతో ప్రపంచంలో రెండో స్థానంలో ఉందని, వాణిజ్య పరంగా 6438మిలియన్ డాలర్లతో 1.6శాతం వాటా ఉందని తెలిపారు. అలాగే భారతదేశం వాణిజ్య వాటాను పెంచడానికి రూపొందించిన పాలసీలను తెలపాలని ప్రశ్నించారు. అలాగే రైతులకు పంట నిల్వ సౌకర్యాలు, రవాణా సదుపాయాలు లేని పరిస్థితులు ఎదుర్కొంటున్నందున వాటిని నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఏమిటని ప్రశ్నించారు. దీనికి కేంద్ర మంత్రి సుదీర్ఘ వివరణ ఇచ్చారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉత్పత్తి, పరిశోధనలో రికార్డు వృద్ధితో ప్రధాన హార్టికల్చర్ హబ్‌గా ఉందని, దేశమంతటా ఇలాంటి విధానాలు పునరావృతం చేయాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తుందా అని ప్రశ్నించారు. దీనికి కేంద్ర మంత్రి సమాధానమిస్తూ ఏపీప్రభుత్వం ఉద్యానవన పంటల హబ్‌గా ఎదుగుతుందని, ఈ విషయం కేంద్ర ప్రభుత్వానికి తెలుసని సమాధానమిచ్చారు. మహిళా స్వయం సహాయక బృందాలకు డ్రోన్ అందించే పథకం 2024-25నుంచి ప్రారంభించి 80శాతం సబ్సిడీ అందిస్తుందని కేంద్ర మంత్రి తెలిపారు.



## నేడు కరువు పరిశీలన
## కేంద్ర బృందం
# పర్యటన

**కర్నూలు, మేజర్‌న్యూస్ ప్రతినిధి:** జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితుల నేపథ్యంలో కరువు పరిశీలన కేంద్ర బృందం జిల్లాలో బుధవారం పర్యటించనుంది. డీఏఎఫ్‌డబ్ల్యు జాయింట్ సెక్రటరీ పంకజ్‌యాదవ్ అధ్యక్షతన కె.పొన్నుస్వామి, మహేష్ కుమార్, కైలాష్, దేవేంద్రరావు, ప్రదీప్‌కుమార్, అంజుభసేరా, అనురాధబతానా, ఆర్.సంతోష్, సంగీత్‌కుమార్‌లతో కూడిన బృందం జిల్లాలో కరువు పరిస్థితులపై అధ్యయనానికి రానున్నారు. ఉదయం అనంతపురం నుంచి 10గంటలకు పత్తికొండ నియోజకవర్గానికి చేరుకొని చిన్నహుల్తి, జూటూరు గ్రామాల్లో పర్యటించనున్నారు. అనంతరం ఆస్పరి మండలంలో బిలేకల్లు, ఆస్పరి మండలం కేంద్రంలో పత్తి, కంది, టమోటా పంటలను పరిశీలించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 12.15గంటలకు ఆదోని మండలం విరూపాపురం గ్రామంలో కరువుతో దెబ్బతిన్న

మిగతా 2లో

## వైకాపా ప్రభుత్వంలోనే
# రోడ్లకు మహర్దశ

- పేదల సౌకర్యార్థమే షాదీఖానా ఆధునీకరణ
- ప్రజల కొరకే పత్తికొండ, నంద్యాల, హైదరాబాద్‌లకు బస్సు సౌకర్యం
- ప్యాపిలి పట్టణంలో రూ.16 కోట్లతో నిర్మించిన డబుల్ రోడ్డు ప్రారంభం
- రూ.67 లక్షలతో ప్యాపిలి బస్‌స్టేషన్‌లో వసతులు ప్రారంభం

2లో


డబుల్ రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి బుగ్గన, నాయకులు

## శశికళ కాదు..
## సత్యభామ
# పోరాటం

5లో

## అభివృద్ధి చేస్తే
# అక్రమ కేసులా
: మాజీ ఎమ్మెల్యే బీసీ

8లో

## అహోబిలేశునికి
# అమావాస్య పూజలు

8లో

## శ్రీశైలంలో ముగిసిన
# కార్తీక మాసోత్సవాలు

- నెల రోజుల పాటు శివనామస్మరణతో మార్మోగిన క్షేత్రం
- సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు
- కనులారా వీక్షించి తరించిన భక్త జనసంద్రం
- కార్తీకమాస ఉత్సవాల నిర్వహణలో భక్తులందరికీ దర్శన భాగ్యం కలిగించి సఫలీకృతుడైన ఈవో డి.పెద్దిరాజు



**శ్రీశైలం, మేజర్‌న్యూస్:** శివ కేశవులకు ప్రీతికరమైన కార్తీక మాసం ఆధ్యాత్మిక భరితంగా సాగింది. ఆయా

మిగతా 2లో

# శ్రీశైలంలో ముగిసిన కార్తీక మాసోత్సవాలు



(మొదటిపేజీ తరువాయి)

దేవాలయాల్లో భక్తులు,మహిళలు నెలరోజుల పాటు పూజలు చేసి కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. కార్తీక మాసోత్సవాల్లో భాగంగా ఇల కైలాసమైన శ్రీశైల మహాక్షేత్రం భక్తపారవశ్యంతో పులకించింది. శ్రీగిరిపై వెలసిన శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి,అమ్మవార్ల దర్శనానికి తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో శ్రీశైలం తరలివచ్చారు. ఈ మాసమంతా భక్తుల శివనామస్మరణతో క్షేత్రం మార్మోగింది. నవంబర్ 14న ప్రారంభ మైన ఉత్సవాలు మంగళవారంతో



ముగిశాయి. చివరి రోజు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి అమ్మవార్లను దర్శించుకొని వారి సేవ లో తరించారు.



**భక్తులకు అన్ని ఏర్పాట్లు**

కార్తిక మాస ఉత్సవాలను శ్రీశైలం దేవస్థానం వైభవంగా నిర్వహించింది. ఆలయ ఈవో డి. పెద్దిరాజు ట్రస్ట్ బోర్డు, సిబ్బంది సహకారంతో ఎప్పటికప్పుడు భక్తుల రద్దీని పర్యవేక్షిస్తూ తగు చర్యలు తీసుకుంటూ విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. సౌకర్యవంతమైన దర్శనం,ఆర్జిత సేవలు నిర్వహణ, త్రాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ మొదలైన అన్ని వసతి సౌకర్యాలను కల్పించారు. రద్దీ రోజుల్లో ఆలయ పూజా వేళలో మార్పులు చేసి క్యూలైన్ల నిర్వహణ నిమిత్తం సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించారు. ప్రతిరోజు సాయంత్రం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ఆలయ ధ్వజస్తంభంపై ఆకాశ దీపాన్ని వెలిగించారు. వేకువజామున 3:30 గంటలకే ఆలయ ద్వారాలు తెరిచి ఉదయం 4.30 నుంచి మధ్యాహ్నం 4గంటల వరకు. తిరిగి సాయంత్రం 5.30 నుండి 11గంటల వరకు భక్తులను దర్శనానికి అనుమతించారు. భక్తులకు అన్నదాన భవనంలో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు అన్న ప్రసాదాల వితరణ, సాయంత్రం అల్పాహారాన్ని అందజేశారు. క్యూ కాంప్లెక్స్ లో వేచి ఉండే భక్తులకు మంచినీరు, బిస్కెట్లు,వేడి పాలు, అల్పాహారం అందించారు.



**కన్నుల పండువగా లక్ష దీపోత్సవం, పుష్కరిణి హారతి**

కార్తీక మాసంలో మూడు సోమ వారాలు, పౌర్ణమి రోజున ఆలయ



పుష్కరిణి వద్ద శాస్త్రోకంగా,కన్నుల పండువగా లక్ష దీపోత్సవాన్ని పుష్కరిణి హారతిని నిర్వహించారు. తుఫాను ప్రభావంతో శ్రీశైలం పరిసర ప్రాంతాల్లో కురిసిన వర్షం కారణంగా ఒక సోమవారంలో లక్ష దీపోత్సవాన్ని,పుష్కరిణి హారతి కార్యక్రమాలను రద్దు చేశారు. కృష్ణవేణి నదీమతల్లికి పుణ్యనదిహారతి,గంగాధర మండపం వద్ద జ్వాలాతోరణం కార్యక్రమాలను సాంప్రదాయపద్ధంగా నిర్వహించారు. ఆయా పూజా కార్యక్రమంలో లక్షల సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి అమ్మవార్లకు నిర్వహించిన కార్యక్రమాలను కనులారా వీక్షించి భక్తిపారవశ్యంలో మునిగి తేలారు.



# నేడు కరువు పరిశీలన కేంద్ర బృందం పర్యటన

(మొదటిపేజీ తరువాయి)

పంటలను పరిశీలిస్తారు. మధ్యాహ్నం ఆదోనిలో భోజన సమయం తీసుకొని 2.30గంటల నుంచి ఆలూరు మండలంలోని కమ్మరచెడు, హోలేబీడు గ్రామాల్లో పర్యటిస్తారు. అనంతరం దేవనకొండ మండలంలోని కప్పట్రాళ్ళ, నెల్లిబండ గ్రామాల్లో, సాయంత్రం కోడుమూరు మండలంలోని ప్యాలకుర్తి, రామచంద్రపురం గ్రామాల్లో పర్యటించి కర్నూలుకు చేరుకుంటారు. కలెక్టరేట్ కాంప్లెక్స్‌లో కరువు పరిస్థితులపై ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తారు.

## ఎనర్జీ అసిస్టెంట్లను సచివాలయ సిబ్బందిగా గుర్తించాలి

**మహానంది, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో ఎనర్జీ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న సిబ్బందిని సచివాలయ సిబ్బందిగా గుర్తించాలని మహానంది మండల ఎనర్జీ అసిస్టెంట్లు కోరారు. మంగళవారం మహానంది మండల ఎంపీడీఓ శివ నాగజ్యోతికి, విద్యుత్తు ఏఈ ప్రభాకర్ రెడ్డికి తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను అందజేశారు. తమ న్యాయమైన కోర్కెలను తీర్చేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాలని అధికారులను వారు కోరారు.



**తిమ్మాపురం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం**

# జొహరాపురం మంచినీటి పంపుహౌస్‌కు తాళం

(మొదటిపేజీ తరువాయి)

గుమ్మనూరు జయరాం కాంట్రాక్టరు పెట్టిన బిల్లు రాకున్నా పంపుహౌస్‌ను ప్రారంభించారు. అంతా బాగానే ఉన్నా పంపు హౌసు ప్రారంభించి నెలలు గడుస్తున్నా మంత్రి ఇప్పిస్తానన్న బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ శివకోటి నాలుగు నెలలు వేచిచూసి చివరికి పంపుహౌసుకు తాళం వేశారు. గతంలో మంత్రి జయరాం గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామస్థులకు ఇచ్చిన మాట ప్రకారం గ్రామానికి మంచినీరు అందిస్తానని చెప్పి తిరిగి గ్రామంలోకి రావలంటే గతంలో ప్రజలు తిరగబడిన సంగతిని గుర్తు చేసుకొని కాంట్రాక్టరును బతిమాలి పంపుహౌసు ను ప్రారంభించారు. అయితే మంత్రి మాటలు విన్న కాంట్రాక్టరు శివకోటి బిల్లులు రాకపోవడంతో పంపుహౌసుకు తాళం వేశారు. దీనిపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో పార్టీ విధేయుడిగా ఉన్న కాంట్రాక్టర్ గ్రామస్థులను మభ్యపెట్టి పంపుహౌసు ను ప్రారంభించారని కాని నేడు బిల్లులు రాలేదంటూ పంపుహౌసుకు తాళం వేయడం సరికాదన్నారు. నాడు మంత్రి మాటలు విని బిల్లులు పెండింగ్‌లో ఉన్నా ప్రారంభించిన వైసిపి నాయకులు ఇప్పుడు గడపగడపకు కార్యక్రమం పూర్తికాగానే పంపుహౌసుకు తాళం వేస్తే చూస్తూ ఊరుకోమని తాళాలు పగలగొట్టి గ్రామానికి మంచినీరు అందించేవరకు పోరాటం చేస్తామని గ్రామస్తులు తెలిపారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి నరేష్ ని వివరణ కోరగా స్పెషల్ అధికారి పరిపాలనలో శివకోటి అనే కాంట్రాక్టర్ పనులు చేపట్టారు. అయితే గ్రామ సర్పంచ్,కాంట్రాక్టరు పరస్పరం సమస్యను ప్రభుత్వంపై తీసుకురావడం సమంజసం కాదని పంపుహౌసు తాళం తీసివేయాలని ఆదేశాలు జారీ చేశామని విషయాన్ని ఈఓఆర్డీకి,ఎంపిడిఓకు తెలపడం జరిగిందనితెలిపారు. నీటిని నిల్వ ఉంచకున్నా డైరెక్టుగా ట్యాంకు ద్వారా సరాఫరా చేస్తున్నామని అధికారులు తెలిపారు.



**పంపు హౌసుకు తాళం వేసిన దృశ్యం**

## వైకాపా ప్రభుత్వంలోనే

# రోడ్లకు మహర్ధశ

**ప్యాపిలి, మేజర్‌న్యూస్ :** 2019లో అధికారంలోకి వచ్చిన వైయస్‌ఆర్‌పార్టీ గడిచిన నాలుగున్నర సంవత్సర కాలంలోనే డోన్ నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారమే నేడు అభివృద్ధి పరుగులు పెడుతుందని, అందులో భాగంగానే ప్యాపిలి పట్టణంలో ప్రజలు, ప్రయాణికుల సౌకర్యం కొరకు రూ.16 కోట్ల నిధులతో డబుల్ రోడ్డు నిర్మించడం జరిగిందని ఆర్థికశాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం ప్యాపిలి పట్టణంలో నూతనంగా నిర్మించిన డబుల్ రోడ్డును మంత్రి బుగ్గన చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం పేదలు శుభకార్యాలు చేసుకోవడం కొరకు పట్టణంలోని షాధిఖానను రూ.30లక్షల నిధులో ఆధునీకరణ చేసి ప్రారంభించారు. అలాగే ప్యాపిలి బస్సుస్టేషన్ నందు ప్రయాణికుల కొరకు రూ.67 లక్షలతో ఏర్పాటు చేసిన వసతులను మంత్రి బుగ్గన ప్రారంభించారు. అనంతరం మండల పరిధిలోని వెంగళాంపల్లె చెరువు వద్ద రూ.3కోట్లతో చేపడుతున్న పర్యాటక అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. అంతకుముందు డబుల్ రోడ్డు ప్రారంభోత్సవంలో భాగంగా ఐదు కిలోమీటర్లు ప్రజలతో మమేకమై పాదయాత్ర చేశారు. స్థానిక మహిళలతో మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి, అభివృద్ధి, సంక్షేమం గురించి, మౌళిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఏవైనా సమస్యలు ఉన్నాయా అంటూ వారితో మంత్రి బుగ్గన ముచ్చటించారు. పాదయాత్రలో భాగంగా మార్గమధ్యలో స్థానిక వెలసిన సాయిబాబా ఆలయాన్ని సందర్శించి, సాయిబాబాను దర్శించుకున్నారు. అలాగే ప్యాపిలి పట్టణం నుండి నంద్యాల, పత్తికొండ పట్టణాలకు బస్సు సౌకర్యాన్ని, అదేవిధంగా హైదరాబాద్ నగరానికి బస్సు సౌకర్యాన్ని ప్రజలు, ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేశారు. అలాగే ప్యాపిలి మండల ప్రజలకు సెలవులలో ఆహ్లాదాన్ని పంచేందుకు రూ.3కోట్లతో మండల పరిదిలోని 44వ నెంబర్ జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేస్తున్న పర్యాటక అభివృద్ధి పనులను మంత్రి బుగ్గన పరిశీలించి, అనుకున్న సమయంలోపు పనులను పూర్తి చేసి, ప్రజలకు సందర్శనార్థం వినియోగంలోకి తీసుకురావాలని కాంట్రాక్టర్లకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పి చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఏపి మీట్ కార్పోరేషన్ చైర్మన్ ఎం.శ్రీరాములు, ప్యాపిలి సర్పంచ్ లక్ష్మిదేవి, జడ్పిటిసి బోరెడ్డి శ్రీరామ్‌రెడ్డి, వ్యవసాయ సలహామండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వరరెడ్డి, ఏపిఐఐసి డైరెక్టర్ బోరెడ్డి పుల్లారెడ్డి, డోన్ మార్కెట్‌యార్డు చైర్మన్ రాజా నారాయణమూర్తి, వైకాపా మండల అధ్యక్షులు బోరా మల్లికార్జునరెడ్డి, ప్యాపిలి సింగిల్ విండో అధ్యక్షులు బోరెడ్డి రామచంద్రారెడ్డి, హుస్సేనాపురం సింగిల్ విండో అధ్యక్షులు అలేబాద్ బాలయ్య, ఉప సర్పంచ్ గడ్డం భువనేశ్వరరెడ్డి, మాజీ జడ్పిటిసి దిలీప్‌చక్రవర్తి, నాయకులు గండికోట చిన్నరామాంజినేయులు, కమతం భాస్కర్‌రెడ్డి, నేరేడుచెర్ల చంద్రశేఖర్‌రెడ్డి, రాజా మురళీకృష్ణ, బోరెడ్డి రఘు, ప్రేమ్‌సాగర్‌రెడ్డి, షాషావలి, కొండయ్య, కాంట్రాక్టర్ రామచంద్రుడు, పర్వతం శ్రీనివాసరెడ్డి, మస్తాన్, బషీర్, జింకల అంజి, బండి ఎర్రిస్వామి, రంగస్వామి, వెంకటేశ్వరరెడ్డి, సోమశేఖర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



# జింక మాంసం తీసుకెళ్తున్న వ్యక్తి అరెస్టు



జింకమాంసంతో పాటు వ్యక్తిని అరెస్టు చేసిన అటవీ శాఖ అధికారులు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** నాగలూటి అటవీ రేంజ్‌పరిధిలో జింకను వేటాడి మాంసాన్ని విక్రయించేందుకు తీసుకెళ్తున్న వ్యక్తిని అరెస్టు చేసి మాంసాన్ని స్వాధీనం చేసుకున్నట్లు డివై ఆర్‌ఓ రత్నప్రభావతి తెలిపారు. వివరాల్లోకి వెళితే నాగలూటి గూడేనికి చెందిన ఈదన్న, బంగి గురువయ్యలు నాగలూటి రేంజ్ పరిధిలోని లింగమయ్య కుంట ప్రాంతంలో జింకను వేటాడి మాంసాన్ని తీసుకొస్తుండ దాడులు చేయడం జరిగిందన్నారు. ఈ దాడుల్లో గుల్ల బంతి ఈదన్నను అరెస్టు చేసి 35 కిలోల పచ్చి జింక తల, కాళ్లు మాంసాన్న స్వాధ్వీనం చేసుకున్నట్లు తెలిపారు. కోర్టులో హాజరు పరచగా 26వ తేది వరకు రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు. అయితే గుల్ల బంగి గురువయ్య పరారిలో ఉన్నట్లు తెలిపారు. త్వరలోనే అరెస్టు చేస్తామని తెలిపారు ఈ దాడుల్లో ఎఫ్‌బిఓ ముర్తుజావలి, ఎఫ్‌ఓ రజాక్, తదితరులు పాల్గొన్నారు.

# 2022 నుండి జమ కాని నంద్యాల జిల్లా పి.యఫ్ డబ్బు

ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నగిరి శ్రీనివాసులు



ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి.హృదయ రాజు రెప్రజెంటేషన్ ఇస్తున్న దృశ్యం

**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:** ఉమ్మడి కర్నూలు జిల్లా నుండి నంద్యాల జిల్లా ఏర్పడిన ప్పటి నుండి నంద్యాల జిల్లా పంచాయతీ రాజ్‌ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది జిల్లా పరిషత్ ప్రావిడెంట్ ఫండ్ (జడ్పీ పిఎఫ్) 2022 సంవత్సరం సెప్టెంబర్ నెల నుండి జీతాలలో పిఎఫ్ కటింగ్ జరిగినప్పటికీ , జడ్పిపిఎఫ్ ఖాతాలలో మాత్రం జమ కావడం లేదని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నగిరి శ్రీనివాసులు నంద్యాల జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి మాధవ్ స్వామి కె సాంబశివుడు ఒక ప్రకటనలో తెలిపారు ఈ సమస్యపై తమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.హృదయ రాజు డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీ మరియు అకౌంట్స్ ఎన్. మోహన్ రావు కి, సి ఎఫ్ఎంఎస్ ఉన్నాతాధికారులకు అమరావతి కేంద్రంలో ప్రాతినిధ్యం చేసినట్లు వారు తెలిపారు.జడ్పీ మరియు మండల పరిషత్ ఉపాధ్యాయుల జీతాలలో పి.ఎఫ్ కటింగ్ జరిగినప్పటికీ ఖాతాలలో మాత్రం జమ కాకపోవడం వల్ల ఆన్ లైన్‌లో ఎంత బ్యాలెన్స్ ఉన్నది తెలియడం లేదని, అదేవిధంగా నంద్యాల జిల్లాలోని వేలాదిమంది ఉపాధ్యాయులు తమ వ్యక్తిగత అవసరాల కోసం జడ్పీపీఎఫ్ లోన్లు దరఖాస్తు చేసుకోవడానికి మరియు పదవీ విరమణకు ఆరు నెలల ముందు క్లోజర్స్ దరఖాస్తు చేసుకోవడానికి ఈ సమస్య తీవ్రంగా ఉందని రాష్ట్ర అధ్యక్షులు హృదయ రాజు రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు వారు తెలిపారు. రాష్ట్ర అధికారులు సానుకూలంగా స్పందించి త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుందని తెలిపినట్లు వారు అన్నారు.

# రాష్ట్రంలో రాక్షసపాలనను సాగనంపుదాం

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుంది ఈ పాలనను సాగనంపేందుకు ప్రజలు సిద్ధం కావాలని మేజర్ సర్పంచ్ హైమావతి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి తిరుపతయ్యానాయుడు, టౌన్ ప్రెసెడెంట్ పిలుపునాచ్చారు. మంగళవారం మండల కేంద్రమైన గోనెగండ్ల లోని పలు వీదుల్లో టీడీపీ నాయకులు పర్యటిం చారు. బాబు షూరిటి భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని అన్నారు. అని రైతు వ్యతిరేఖ ప్రభుత్వంగా మారిన వైసీపీ కి ఇక



అమలు చేయబోతున్న సంక్షేమ పథకాలను వివరిస్తున్న నాయకులు

చమరగీతం పాడాల్సిన సమయం దగ్గర పడిందని ప్రజా సమస్యలను ప్రశ్నింస్తే వారి పై కేసులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలపై కేసులు బనాయిస్తున్నారన్నారు. నిత్యవసర వస్తువులు, పెట్రోల్, డీజిల్, ధరలు పెంచడమే గాక కరెంట్ బిల్లులు, బస్సర్జీలు పెంచడం దారుణం అన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఏడాదికి మూడుసిలిండర్లు ఉచితంగా ఇస్తామన్నారు. మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం, 18 ఏళ్లు వాటిని మహిళలకు నెలకు రూ. 1500, నిరుద్యోగులకు నెలకు రూ.3000 ప్రతి గ్రామానికి తాగునీటి సమస్య లేకుండా చూస్తామని టీడీపీ హామీ ఇస్తుందని తెలిపారు. పకృద్దీన్, జిలాని, లక్ష్మీకాంత్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయాలి



ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

**గడివేముల, మేజర్‌న్యూస్ :** సుప్రీం కోర్టు తీర్పును రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని అంగన్‌వాడి వర్కర్లు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడి వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. అంగన్‌వాడి యూనియన్ మండల నాయకులు, అధ్యక్ష కార్యదర్శులు వసంతమ్మ, రామ చెన్నమ్మలు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నేటినుంచి సమ్మెబాట చేపట్టామని అన్నారు. అంగన్‌వాడి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వానికి విజ్ఞాపన పత్రాలు అందజేయడం, శాంతియుత నిరసనలు, ధర్నాలు, హక్కు పోరాటాలు చేయడం జరిగిందని అంగన్‌వాడి కార్యకర్తలకు సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటి ఇవ్వాలని, కనీస వేతనాల పెంపుదల చేయాలని, ఆరు నెలల నుండి బకాయి పడ్డ అద్దెలు, టీఏ బిల్లులు తక్షణమే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రతిపక్ష నాయకునిగా ఎన్నికల్లో అంగన్‌వాడీలకు తెలంగాణ ప్రభుత్వం కంటే అధనంగా వేతనాలు ఇస్తానని ఇచ్చిన హామీలు అమలు చే యాలన్నారు. ఆయాలు 50 సంవత్సరాలు పెంపుదల, రాజకీయ జోక్యాన్ని నివారించాలని, మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా గుర్తించి వేతనాలు, ప్రమోషన్లు కల్పించాలన్నారు. అంగన్‌వాడి వర్కర్ల డిమాండ్లను పరిష్కరించాలని పరిష్కరించకపోతే రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడి హెల్పర్లు, ఆయాలు పాల్గొన్నారు.

# ఆశా వర్కర్లకు కనీస వేతనం చెల్లించాలి – సీఐటీయు

**ఆస్పరి, మేజర్‌న్యూస్ :** ఆశా వర్కర్లకు కనీస వేతనం చెల్లించాలని సీఐటీయు మండలకార్యదర్శి రామాంజనేయులు, హనుమంతు, రంగస్వామి, దస్తగిరిమ్మలు డిమాండ్ చేశారు. ప్రజలకు ఎన్నో సంవత్సరాలుగా సేవలు చేస్తున్న ఆశావర్కర్లకు కనీస వేతనం చెల్లించకపోవడం అన్యాయమన్నారు. ప్రభుత్వం వెంటనే కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, పనిభారం తగ్గించాలని, రిటైర్మెంట్, ఈఎస్ఐ తదితర సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈనెల 18నుండి సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. అనంతరం పిహెచ్‌సి డాక్టర్ రఘురామిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్ల యూనియన్‌నాయకులు ప్రభావతి, రాధా, లక్ష్మీ, భూవనేశ్వరి, పద్మ, అన్నపూర్ణ, సువర్ణ, నాగలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.




## చలానా కట్టకుండా రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారిపై కేసు నమోదు

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్ :** నగర శివారులోని పంచలింగాల వద్ద ఉన్న ఓ స్థలానికి ప్రభుత్వానికి చలానా కట్టకుండా దొంగ చలానా చూపించి స్థలాన్ని రిజిస్ట్రర్ చేయించుకున్న గొల్ల లక్ష్మన్న, ఉప్పలపాటి చలపతిలపై 4వపట్టణ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. పంచలింగాల వద్ద ఉన్న సమ్మర్ స్టోరేజీ వద్ద ఒక స్థలానికి సంబంధించి 2022 9వనెలలో ఫేక్ చలానా తెచ్చి రిజిస్ట్రర్ చేసుకున్న లక్ష్మన్న, చలపతిపై సబ్‌రిజిస్ట్రార్ ప్రదీప్‌కుమార్ ఫిర్యాదు చేశారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు 4వ పట్టణ ఎస్ఐ పెద్దయ్యనాయుడు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## మెడికల్ షాపులో చోరీ ..రూ.15వేలు మాయం

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్ :** నగరంలోని వెంకటరమణకాలనీలో ఉన్న ఎంఎస్.ప్రసన్న మెడికల్ షాపులో చోరీ జరిగింది. 2వ పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు షాపు షట్టర్ పగులగొట్టి లోపలికి ప్రవేశించి కౌంటర్‌లో ఉన్న రూ.15వేలు చోరీ చేయడంతో షాపు యజమాని జంగం లోకేష్ మంగళవారం ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## మోటర్ సైకిళ్ళ చోరీలో ముద్దాయిలు అరెస్ట్



పోలీసుల అదుపులో ఉన్న ముద్దాయిలు

**వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్:** వెల్దుర్తి, ఆళ్ళగడ్డ, అనంతపురం జిల్లా, విడపనకల్ పోలీసుస్టేషన్ పరిధిలో మోటర్ సైకిళ్ళను దొంగలించిన ఇద్దరు ముద్దాయిలను అరెస్ట్ చేసినట్లు వెల్దుర్తి ఎస్సై పి.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు మంగళవారం ఉదయం మండల పరిధిలోని బొమ్మిరెడ్డిపల్లె, అల్లుగుండు గ్రామాల మధ్య ఉన్న 44వ నెంబర్ జాతీయ రహదారి పక్కన ఉన్న శివాలయం వద్ద మోటర్ సైకిళ్ళను చోరి చేసిన ప్యాపిలి మండలం, మాధవరం గ్రామానికి చెందిన దర్శినేని నాగభూషణం, తెలంగాణ రాష్ట్రం, మహబూబ్‌నగర్‌లోని సంజీవనగర్‌కు చెందిన ఏ.అనీల్ ముద్దాయిలను అరెస్ట్ చేశామని, వారి వద్ద నుండి దొంగలించబడిన ఏపి21బిక్యూ2586, ఏపి02ఏసి1991, ఏపి21బిహెచ్3228 నెంబర్లు గల మోటర్ సైకిళ్ళను స్వాధీనం చేసుకొని, రిమాండ్ నిమిత్తం, డోన్ కోర్టుకు హాజరుపరచినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## ఆదోని సీఐ బదిలీ

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్ :** ఆదోని వన్‌టౌన్‌లో సీఐగా పనిచేస్తున్న విక్రమ సింహాను కడప జిలాలకు బదిలీ చేసినట్లు కర్నూలు డీపీవో కార్యాలయం చేసి ఉత్తర్వులు జారీ చేశారు. ఆ స్థానంలో ఎవరిని నియమించలేదు.

## అంగన్‌వాడీ వర్కర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

**వెల్దుర్తి, మేజర్‌న్యూస్:** రాష్ట్రంలోని అంగన్‌వాడి వర్కర్లు, హెల్పర్లకు ఇచ్చిన హామీలను, వారు ఎదుర్కుంటున్న సమస్యలను రాష్ట్ర వైకాపా ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడి వర్కర్లు, హెల్పర్లు చేస్తున్న ధర్నాకు ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు యేసయ్య ఆధ్వర్యంలో మంగళవారం సంఘీబావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడి వర్కర్లపై పనిభారం మోపడం తప్పా వారికి పనికితగ్గ వేతనాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. కావున వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏపి అంగన్‌వాడివర్కర్స్, హెల్పర్స్‌కు అండగా నిలిచి ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు. ఏఐటియుసి మండల అధ్యక్షులు బి.మాదవస్వామి, అంగన్‌వాడి వర్కర్లు, హెల్పర్లు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



## రైతు భరోసా కేంద్రాన్ని ఏవో తనిఖీ

**పాములపాడు, మేజర్ న్యూస్ :** పాములపాడు మండల పరిధిలోని మద్దూరు గ్రామంలోని రైతు భరోసా కేంద్రాన్ని మండల వ్యవసాయ అధికారి పరమేశ్వర్ రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంటను కోత ప్రయోగం చేసి 42 బస్తాలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఈఓ ముర్తుజావలి ఇన్సూరెన్స్ అధికారులు రైతులు పాల్గొన్నారు.

## వేతనాలు పెంచాలంటూ అంగన్‌వాడీల సమ్మె

**చాగలమర్రి ,మేజర్ న్యూస్ :** అంగన్‌వాడీ కార్యకర్తల,సహాయకుల వేతనాలు పెంచాలంటూ మంగళవారం చాగలమర్రి పట్టణంలోని అడ్డవాగు సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సమ్మె నిర్వహించారు.సిఐటియు సంఘాల ఆధ్వర్యంలో సమ్మెచేసారు.టిడిపి రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు అన్సర్‌బాషా హమాలీల సంఘం అధ్యక్షుడు,టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి గుత్తి నర్సింహులు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు కలిసి అంగన్‌వాడీల సమ్మె కు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా సిఐటియు నాయకురాలు పద్మ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ 26వేలు ఇవ్వాలని,సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీని అమలు చెయ్యాలని,వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని,రిటర్మెంట్ బెనిఫిట్‌రూ.5 లక్షలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు.అలాగే హెల్పర్‌లకు పదోన్నతులకు వయో పరిమితి50 సంవత్సరాలకు పెంచాలని,రిటర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలన్నారు.

సూర్య

బుధవారం 13 | డిసెంబర్ 2023

# క్రీడాకారులకు ఆడుదాం ఆంధ్ర క్రీడా సామాగ్రి పంపిణీ



పంచాయతీ కార్యదర్శులకు ఆడుదాం ఆంధ్ర కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ వీరభద్రుడు

**చాగలమర్రి, మేజర్ న్యూస్ :** గ్రామీణా స్థాయిలో వివిధ అంశాల క్రీడలలో ప్రావీన్యం ఉన్నమట్టిలో మాణిక్యాలను వెలికి తీసి వారిని జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడలలో పాల్గొనే అవకాశం కల్పించటానికి మన రాష్ట్ర ముఖ్యమంత్రి సచివాలయ స్థాయి నుండి క్రీడలను ప్రోత్సహించటానికే ఆడుదాం-ఆంధ్రా పోటీలను నిర్వహిస్తున్నారని ఎంపీపీ వీరభదుడు అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ మహబూబ్దౌలా ఆధ్వర్యంలో మండలంలోని 17 సచివాలయాలకు క్రీడా సామాగ్రిని ఎంపీపీ వీరభద్రుడు సచివాలయ కార్యదర్శులకు అందజేశారు. ఒక్కో సచివాలయానికి ఒక్కో క్రీడాంశానికి సంబందించి 3 కిట్ల చొప్పున క్రికెట్, వాలిబాల్, బ్యాట్మీటన్, టెన్నికాయిట్,కార్బాలు కలిపి 14కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహబూబ్దౌలా మాట్లాడుతూ ఈ నెల 15వ తేది నుండి 20 వరకు సచివాలయ స్థాయిలో, 20వ తేది నుండి30 వరకు మండల స్థాయిలో, 26వ తేది నుండి 30 వరకు నియోజకవర్గ స్థాయిలో క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని 17 సచివాలయాల పరిధిలో 2867 మంది క్రీడాకారులు 5 ఆంశాలలో పోటీలో పాల్గొనేందికు తమ పేర్లను ఆడుదాం -ఆంధ్ర కార్యక్రమంలో సచివాలంలో నమోదు చేసుకున్నారని తెలిపారు. పేర్లు నమోదు చేసుకున్న క్రీడాకారులందరు కూడా క్రీడల్లో పాల్గొని ఆవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నియోజకవర్గ స్థాయిలో విజయం సాధించిన క్రీడాకారులకు ప్రభుత్వం మొదటి బహుమతిగారూ. 30,000లు,ద్వీతీయ బహుమతిగా రూ. 25,000, తృతీయ బహుమతిగా రూ. 5,000లు నగదు పురస్కారాలను ప్రకటిఒచిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోవిందయ్య. మేజర్ గ్రామపంచాయతీ ఇంచార్జి ఈ.ఓ. నాగమణి, పంచాయితీ కార్యదర్శులు దస్తగిరి వెంకటేశ్వర్లు, సబియా, స్వర్ణకుమార్, ఏసుదాసు, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి



ఆళ్లగడ్డలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న భూమా

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి అని ఆళ్లగడ్డ తాలూ టిడిపి యువ నాయకులు భూమా జగద్విఖ్యాత్ రెడ్డి అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని కుద్బా వీధి, బీగాల వీధి, సత్రం వీధిలో మంగళవారం బాబు ష్యూరిటి భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రం అందించి తెలుగుదేశం పార్టీని ఆదరించాలని కోరారు. భవిష్యత్తు గ్యారెంటీ అనే కార్యక్రమం ద్వారా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి కుటుంబానికి బంగారు భవిష్యత్తు చూపించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు గుండా మణి, ఎయిర్టెల్ శేఖర్ రెడ్డి, కౌన్సిలర్ హుస్సేన్ భాష, మాజీ జెడ్పిటిసి చాంద్ బాషా,భాస్కర్ యాదవ్, చింతకుంట్ల రామశేఖర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతో మానసిక వికాసం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రవీణ్ కుమార్

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** క్రీడలతో క్రీడాకారులకు మానసిక, శారీరక వికాసం వస్తుందని ఎంపీడీవో ప్రవీణ్కుమార్ అన్నారు. ఈ నెల 15 నుంచి గ్రామాల్లో ఆడుదాం ఆంధ్ర కార్య క్రమం నిర్వహిస్తున్నామని ఎంపీడీవో తెలిపారు. మంగళవారం ఎంపీడీవో సమావేశం భవనం నందు గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు, పీఈటీ మాస్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో ఐదు రకాల ఆటలు ఆడుతారని అందులో ఖోఖో, బ్యాడ్మిం టన్, వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 15 నుంచి 20 వరకు గ్రామాల్లో, 21 నుంచి జనవరి 4 వరకు మండల స్థాయిలో క్రీడలు నిర్వహిస్తుమన్నారు. ఈ క్రీడలతో గ్రామీణ క్రీడాకారులలో నైపుణ్యాన్ని గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ నాగేష్ ఈవో సతీస్, కార్యదర్శి తాటికొండ వెంకటేశ్వర్లు, బైలుప్పల వెంకటేశ్వర్లు. తోటయ్యం పాల్గొన్నారు.

# ఏపి బాగుండాలి అంటే.. బాబు సిఎం కావాలి

**డోన్ నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మారం మన్నె సుబ్బారెడ్డి**



ప్రజలతో మాట్లాడుతున్న ధర్మారం మన్నె సుబ్బారెడ్డి

**ప్యాపిలి, మేజర్న్యూస్:** గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో, చంద్రబాబునాయుడు పాలనలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అభివృద్ధి చెందిన రాష్ట్రంగా ఎంతో గుర్తింపు సాధించిందని, అలాగే రాష్ట్ర విభజన అనంతరం కూడా 2014లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబునాయుడు పాలనలో కూడా ఏపిని అభివృద్ధికి నిదర్శనంగా తీర్చిదిద్దేందుకు ఎంతో శ్రమించారని, అయితే 2019 ఎన్నికలలో అధికారంలోకి వచ్చిన వైయస్ఆర్ పార్టీ హయాంలో గడిచిన నాలుగున్నర సంవత్సర కాలంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతోపాటు, రాష్ట్రంలోని ప్రజలు కూడా అభివృద్ధికి ఆమడదూరంలో ఉండిపోయారని, ఆంధ్రప్రదేశ్ను అప్పుల కూపంగా మార్చిన ఘనతను ఏపి ముఖ్యమంత్రి జగన్కు సాధ్యపడిందని డోన్ నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మారం మన్నె సుబ్బారెడ్డి ఆరోపించారు. మండల పరిధిలోని పెద్దపూదిళ్ళ గ్రామంలో గ్రామ టిడిపి నాయకులు ప్రసాద్రెడ్డి ఆధ్వర్యంలో బాబుష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ 2024 ఎన్నికలలో టిడిపి అధికారంలోకి వస్తే చేపట్టబోయే సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ధర్మారం మన్నె సుబ్బారెడ్డి మాట్లాడుతూ నేడు రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, అధిక ధరలు, చేతకాని పాలనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఎప్పుడెప్పుడు ఎన్నికలు వస్తాయా, వైకాపాను గద్దెను దింపుదామా అని ప్రజలు ఎదురుచూస్తున్నారని, అభివృద్ధి చేసే నారా చంద్రబాబునాయుడి నాయకత్వం కోసం రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్నారని, కావున నారా చంద్రబాబునాయుడిని ముఖ్యమంత్రి చేసుకోవడం ప్రస్తుత పరిస్థితుల లో మనకు ఎంతో అవసరమని ధర్మారం మన్నె సుబ్బారెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వై.నాగేశ్వర రావుయాదవ్, కమతం కాటమయ్య, ఆర్ఈ.రాఘవేంద్ర, గండికోట రామసుబ్బయ్య, భూశెట్టి చిన్నసుంకయ్య, మెట్టుపల్లె సుదర్శన్, గొల్ల రామ్మోహన్యాదవ్, పెద్దపూదిళ్ళ కాంతరెడ్డి, ఓసూర్ రంగారెడ్డి, కోదండరామయ్యయాదవ్, న్యాయవాది అరున్, బసిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, రామాంజినేయులు చౌదరి, చంద్రారెడ్డి, రామలింగేశ్వరరెడ్డి, ఈడిగ హరి, గ్రామ టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# తపాల కార్మికుల నిరవధిక సమ్మె



సమ్మెలో పాల్గొన్న తపాల ఉద్యోగులు

**బనగానపల్లెమేజర్,న్యూస్:** తపాల కార్మికులు మంగళవారంనాడు నిరవధిక సమ్మెకు వెళ్లడంతో తపాల కార్యకలాపాలకు ఆటంకం ఏర్పడింది. తపాల కార్మికులకు 8గంటలు సివిల్ సర్వేంట్ హోదా కల్పించాలని 12.24.36 సంవత్సరాలలో ఇంక్రిమెంట్ ఇవ్వాలని గ్రూపు ఇన్సురెన్స్ 5లక్షలు ఇవ్వాలని అలాగే వేతన కమిటీని అమలు చేయడంతో ఓపాటు న్యాయ పరమైన తమ డిమాండ్లను నెరవేర్చాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తపాల సిబ్బంది జయన్న, రాముడు, గుప్త, వలి బాష , మహమ్మద్ బాష, రాజశేఖర్, నాగేశ్వర రెడ్డి, దాదా బాషా, ఖాన్ తదితరులు పాల్గొనగా ఈ సమ్మెకు రిటైర్డ్ ఎస్.ఎ.ఎం వేణుగోపాల్, రిజ్వాన్లు మద్దతు తెలిపారు.

# రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో అమలు చేసిన ఘనత సీఎం జగన్దే



మాట్లాడుతున్న నిర్వహిస్తున్న వైసీపీ నాయకులు

**ఆదోని, మేజర్న్యూస్ :** రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో అమలు చేసిన ఘనత సీఎం జగన్కే దక్కిందని మున్సిపల్ ఛైర్మన్ బోయ శాంతి, జెసిఎస్ కన్వీనర్ వెల్లాల మధుసూదన్ శర్మ, వారు ఇంచార్జీ చంద్రశేఖర్రెడ్డిలు పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మెల్యే సాయిప్రసాద్రెడ్డి ఆదేశాల మేరకు మున్సిపాలిటీ 2,5వ వార్డులో ఆంధ్రప్రదేశ్కు మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్నే కావాలని కార్యక్రమం 25వ వార్డు కౌన్సిలర్ కృష్ణవేణి అధ్యక్షతన వార్డు ఇంచార్జీలు రాజు, సిద్ద, మల్లికార్జునల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జగనన్న చేనేత కార్మికులకు, 45 సంవత్సరాలు నిండిన మహిళలకు జగనన్న ఆసరా, గోరుముద్ద, బడుగు, బలహీన వర్గాల బీసీ ఎస్టీల, మైనార్టీలకు సీఎం జగన్ సంక్షేమ పథకాలను అమలు చేస్తూ, రాష్ట్రా భివృద్ధికి, పేదల అభివృద్ధికి ఆదరాభిమానాలు,సహాయ సహకారాలు ఉంటాయన్నారు. అనంతరం వారు జెండావిష్కరణ చేసి ఇంటి ఒంటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు కన్వీనర్లు గోవిందరాజు, రాఘవేంద్ర, మల్లికార్జున, శివ, నరసింహా, ఆంజి,లాల ప్ప, వైఎస్సార్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సుద్ద వంక కాల్వ సమస్యను పరిష్కరిస్తా..టీజీ భరత్

**కర్నూలు, మేజర్న్యూస్ప్రతినిధి :** వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని, ప్రజలు ఎదుర్కొంటున్న సుద్దవంక కాల్వ సమస్యను తీరుస్తానని కర్నూలు టీడీపీ ఇన్చార్జి టీజీ భరత్ అన్నారు. మంగళవారం నగరంలోని 23వవార్డు శ్రీరామ్నగర్లో ఆయన బాబుష్యూరిటీ- భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. వార్డులోని ఇళ్లకు వెళ్లి ప్రజలను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ మేనిఫెస్టో వివరించి తమ ప్రభుత్వం వస్తే అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. పెరిగిపోయిన కరెంటు బిల్లులు, నిత్యవసర సరుకుల ధరలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అందుకే వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కర్నూలులో తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే స్థానికంగా పరిశ్రమలు తీసుకవచ్చి యువతకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పిస్తానని వివరించారు. ప్రజలకు మంచి చేసే నాయకుడినే ఎన్నుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు గున్నామార్క్, అజయ్, భాస్కర్, ఉదయ్, జుబేర్ నాగరాజు, పరమేష్, పృథ్వీ, వినయ్, మల్కల్, భరత్, పురుషోత్తం, డేవిడ్ పాల్గొన్నారు.



# జగనన్నతోనే అన్ని వర్గాల సంక్షేమం

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** అన్ని వర్గాల సంక్షేమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డితోనే సాధ్యమని నియోజకవర్గ వైఎస్సార్సీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్మోహన్రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం మండలంలోని పెద్దమరివీడు గ్రామంలో రెండవ రోజు గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా అందించిన సంక్షేమ లబ్దిని వివరించి బుక్లెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఏ ఇతర రాష్ట్రాల్లో లేని విధంగా మన రాష్ట్రంలోనే నవరత్నాల పథకాలతో పాటు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ జగనన్న దేశానికే మార్గదర్శకమయ్యారన్నారు.పల్లె ప్రజలు ప్రభుత్వ పథకాల కోసం మండల కేంద్రాలకు వెళ్లకుండా గ్రామాల్లో గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేశారన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఎలాంటి సిఫారసు లేకుండా పార్టీలు, వర్గాలకు అతీతంగా సంక్షేమ ఫలాలను అందిస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. .అలాగే నాడు-నేడు కార్యక్రమంతో పాటు విద్యా వ్యవస్థలో జగనన్న తీసుకొచ్చిన మార్పులే ఇందుకు కారణమన్నారు. కార్పొరేట్ స్కూల్స్ కంటే మిన్నగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయన్నారు. ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం జగన్ను మరోసారి సీఎంగా గెలుపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు, బందెనవాజ్, మన్సూర్ నరసన్న ఆచారి, శంకర్ రెడ్డి, నాగేష్, లోకేష్, క్రిష్ణగౌడ్, దరగల రఫీ, తిమ్మప్ప, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.



# సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలి



దీక్ష కు టిడిపి నాయకులు సంఘీభావం

**పాములపాడు,మేజర్‌న్యూస్:** సుప్రీంకోర్టు తీర్పు ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని అంగన్వాడీ వర్కర్లు డిమాండ్ చేశారు. మంగళవారం పాములపాడు లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడీ వర్కర్లు ఎదుర్కుంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. సిఐటియు సిఐటియు జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు అమలు ప్రకారం గ్రాడ్యుటి అమలు చేయాల ని కోరారు.రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రకారం తెలంగాణా కన్నా అదనంగా వేతనాలు పెంచాలనిఅన్నారు. పదవీ విరమణ చేసిన అనంతరం 5లక్షల బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. వేతనంలో సగం పింక్షన్ ఇవ్వాలన్నారు. ప్రీ స్కూల్‌లను బలోపేతం చేయాలన్నారు. అంగన్వాడీలకు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని అన్నారు. ప్రభుత్వ పథకాలు అమలు చేయడంలో తమ కృషి ఎంతగానో ఉందన్నారు. పనిభారంతో అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నామని తెలిపారు.తమ డిమాండ్ లను అమలు చేసేంత వరకు దీక్షను విరమించమని తెలిపారు. దీక్షకు టిడిపి నాయకులు సంఘీభావం తెలిపారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తిమ్మారెడ్డి, గోవిందు, మధు కృష్ణ, ఆఫీస్ గట్టు లింగేశ్వర గౌడ్,బషీర్‌అహ్మద్,లింగాల సర్పంచ్ మల్లేశ్వర్‌రెడ్డి,సోమన్న, వెంకటేశ్వరరావు బాలన్న, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.

# ఎమర్జెన్సీ కార్డియాక్ కేర్ వర్క్‌షాప్



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్ :** నగరంలోని జీజీహెచ్‌లో మంగళవారం ఎమర్జెన్సీ కార్డియాక్ కేర్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో 50మంది వైద్యులకు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కార్డియాలజీ వైద్యులు, నిపుణులు గుండెపోటుకు వచ్చే కారనాలు, ఈసీజీలో వచ్చే మార్పులు, అత్యవసర చికిత్స ఇవ్వడం, థ్రాంబోలైసిస్ చేయడం, రోగులను 108 అంబులెన్స్ ద్వారా ఎలా తీసుకరావాలని అనే దానిపై శిక్షణ ఇచ్చారు. ఆసుపత్రి వచ్చిన తర్వాత ఎలా చికిత్స అందిస్తారన్న దానిపై అవగాహన కల్పించారు.కేఎంసీ ప్రిన్సిపాల్ సుధాకర్, డాక్టర్లు శ్రీరాములు, లక్ష్మిభాయ్, మహేశ్వరరెడ్డి, విద్యాసాగర్, శ్రీనివాసులు,ప్రశాంత్,లలిత, వెంకటరమణ పాల్గొన్నారు.

# 16న జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :**

జిల్లా స్థాయిలో జరిగే సైన్స్ ఎగ్జిబిషన్ ఈ నెల 16న జరుగుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి వి.రంగారెడ్డి తెలిపారు. నగరంలోని టౌన్‌మోడల్ పాఠశాలలో ఈ ఎగ్జిబిషన్ జరుగుతుందన్నారు. మండల స్థాయిలో ప్రథమ సాన్థంలో నిలిచిన విద్యార్థులు జిల్లా స్థాయిలో పాల్గొంటారన్నారు. మండల స్థాయి ఎగ్జిబిషన్ 13, 14వతేదీల్లో జరుగుతుందన్నారు. విద్యార్థులు 8.30గంటలలోపు ఎగ్జిబిషన్ జరిగే ప్రాంతానికి రావాలన్నారు. మిగతా వివరాలను డీఎస్ఓ రంగమ్మను సంప్రదించాలన్నారు.

# జగన్‌ను మరోసారి సిఎంగా గెలిపించుకుందాం

**సంక్షేమ పాలనకు అండగా నిలుద్దాం.. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ**

**వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్:** రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి మరింత జరగాలన్నా, పేదలను పెత్తందారుల నుండి రక్షించాలన్నా మరోసారి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని పత్తికొండ నియోజకవర్గం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ అన్నారు. మా నమ్మకం నువ్వే జగన్, ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని మంగళవారం మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం-1 నందు ఎంపిడిఓ శ్రీనివాసరావు, వైకాపా మండల కన్వీనర్ బొమ్మన రవీంద్రనాథ్‌రెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ ముఖ్య అతిథిగా హజరైయ్యారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయ పరిధిలో వైయస్ఆర్ పార్టీ జెండాను స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ వైయస్ఆర్ పార్టీ అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి ప్రజలకు వివరించారు. అంతకుముందు ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజలు ఏ మేరకు లబ్ధిపొందారో రూపొందించిన సంక్షేమ బోర్డును ఎమ్మెల్యే, నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ నేడు రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు సమపాలలో ప్రజలకు నేరుగా అందుతున్నాయంటే అది ఒక్క సిఎం జగన్‌కే సాధ్యపడిందని, గత ప్రభుత్వాలలో అర్హత ఉండి కూడా పథకం పొందాలంటే ఆనాడు అధికారంలో ఉన్న పార్టీ నాయకుల జేబులలోకి డబ్బులు చేరితేనే ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందేవన్నారు. కాని సిఎంగా జగన్ బాద్యతలు చేపట్టినప్పటి నుండి నేటి వరకు గడిచిన నాలుగున్నర సంవత్సర కాలంలో కేవలం అర్హతే ప్రామాణికంగా చేసుకొని, అర్హులకు నేరుగా సంక్షేమ ఫలాలు అందుతున్నాయంటే అది సిఎం జగన్‌కే దక్కిందన్నారు. రాబోయే 2024 ఎన్నికలలో మరోసారి జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసుకోవాలని ఆమె ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సుంకన్న, గ్రామ సర్పంచ్ శైలజ, బ్రహ్మగుండం ఆలయ చైర్మన్ బొమ్మన పెద్దిరెడ్డి, ఎంపిటిసిలు, వార్డు సభ్యులు, గ్రామ వార్డు వాలంటీర్లు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వైకాపా నాయకులు పాల్గొన్నారు.



సంక్షేమ బోర్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ, నాయకులు, అధికారులు

# రైతులు ఇబ్బంది పడుతున్నా ప్రభుత్వానికి పట్టదా - మాజీ ఎమ్మెల్యే బీసీ



కరపత్రాలను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ

**బనగానపల్లెమేజర్,న్యూస్:** రైతులు సాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వానికి ఏమాత్రం పట్టడం లేదని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి అన్నారు. మంగళవారంనాడు బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా మీరాపురం గ్రామంలో ఆయన పర్యటించారు. ప్రతి ఇంటికి తిరిగి చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. టీడీపీ అధికారంలోకి వస్తే ప్రతి కుటుంబానికి లబ్ది చేకూరుతుందని నేడు రాష్ట్రంలో రైతులు ఎన్నో ఇబ్బందులకు లోనవుతున్నారని వాటిని పట్టించుకునే సమయం ఈ ప్రభుత్వానికి లేదన్నారు. కేవలం కక్ష సాధింపు , తప్పుడు కేసులు బనాయించడంపై ఉన్న శ్రద్ధ రాష్ట్రాభివృద్ధిపై వారు చూపించడం లేదని తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 2014 నుంచి 2019 వరకు 3.15లక్షల రూపాయలతో మీరాపురం గ్రామాన్ని అభివృద్ధి పరచడం జరిగిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బత్తుల భాస్కర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, బాలిరెడ్డి, శివశంకర్ రెడ్డి, నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సంగమేశ్వరంలో కార్తీక ముగింపు పూజలు

**కొత్తపల్లి, మేజర్‌న్యూస్ :** సప్తనదుల సంగమేశ్వర క్షేత్రంలో కార్తీకమాస ముగింపు సందర్భంగా ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను మంగళవారం నిర్వహించారు. ఆలయంలో వున్న వేపధారు శివలింగానికి నదీ జలాలతో అభిషేకం, పంచామృతాలతో అభిషేకించి విశేష పూజలు గావించారు. అనంతరం సాయంకాల వేళ నదీ జలాలకు సంధ్యా హారతి ఇచ్చారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కొలను భారతి క్షేత్రంలోనూ సప్త శివాలయాలలో విశేష పూజలు నిర్వహించారు. మండల కేంద్రమైన కొత్తపల్లిలోని తాండవ మల్లేశ్వర స్వామికి కార్తీకమాస ముగింపు పూజలు చేసి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



హారతులు ఇస్తున్న మహిళలు

# శశికళ కాదు.. సత్యభామ పోరాటం..

**అడుగడుగునా అడ్డంకులు ..కలలో కూడా వెనుకడుగు వేయని శశికళ..**

**కురువ మహా సింహగర్జనకు అడ్డంకులు సృష్టిస్తున్న ఒక పార్టీ నాయకులు..**

**బిసిలకు సాటి బిసిలే అగర్భ శత్రువులు..**

**కుల సంఘ నాయకులే బాణాలు ఎక్కుపెడుతున్న వైనం..**

**వెనుక కృష్ణ మోహనుడి అండ.. ముందు కుల భాంధవుల అండ..**



శశికళా కృష్ణమోహన్ దంపతులు

**ఆలూరు, మేజర్ న్యూస్:** ఆలూరు నియోజకవర్గంలో రాజకీయ పరిణామాలు చాలా వేడెక్కుతున్నాయి. నియోజకవర్గ కేంద్రమైన ఆలూరులో ఈ నెల 24 న కురువ మహా సింహ గర్జన సభను ఏర్పాటు చేసి ఉమ్మడి కర్నూలు జిల్లాలో అత్యధిక జనాభా కలిగి వెనుకబడిన మాదాసి,మాదారికురువల కు ఎస్సీ కుల ధృవపత్రాలు ఇవ్వాలని అలాగే వచ్చే ఎన్నికల్లో రెండు ఎంఎల్ఏ సీట్లు ,ఎంపి సీటు ఇవ్వాలని డిమాం డ్‌తో సభ ఏర్పాటు చేయనున్నారు.అయితే గతంలో కూడా ఎన్నికల ముందు ఆలూరులో ఏర్పాటు చేసిన కురువ సం ఘం సభలో జాతీయ బిసి సంఘం అద్యక్షులు ఆర్.కృష్ణ య్య ఆద్వర్య ంలో ప్రధాన పార్టీల నాయకులకు విన్నవించినా వారు పెడచెవిన పెట్టారు. మళ్లీ ఈ సారి కూడా కురువలకు కేవలం కింది స్థాయి పదవులు కట్టబెట్టి చేయి దులుపుకుంటారని బావించి బళ్లారి డిప్యూటి మాజీ మేయర్ మొలగవల్లి శశికళ కృష్ణమోహన్ ఒక అడుగు ముందుకు వేసి ఆలూరులో ఈనెల24 న కురువ మహా సింహగర్జన సభను పెట్టాలని నిర్ణయించారు.అయితే గత ఎన్నికలలో ఆలూరుతో పాటు జిల్లాలో సగం మంది కురువ సంఘం నాయకులు వైసిపికి జై కొట్టారు.అందువల్ల జిల్లాలో వైసిపి పార్టీ వారికి జడ్పి వైస్ చైర్మన్ పదవి కట్టబెట్టింది.జిల్లాలో అత్యధిక జనాభా కలిగిన కురువలకు కేవలం జడ్పిటిసి, ఎంపిటిసి పదవులు ఇచ్చి ఇరు పార్టీలు చేయి దులుపు కుంటున్నారని ఈసారి ఓట్లు మావే సీట్లు మావే అంటూ బళ్లారి డిప్యూటి మాజీ మేయర్ శశికళా కృష్ణమోహన్ నడుంబిగించి కురువ మహాగర్జన ద్వారా ఉమ్మడి కర్నూలు జిల్లాలో రెండు ఎంఎల్ఏ సీట్లు, ఒక ఎంపి సీటు కేటాయించాలని డిమాండ్ చేస్తూ గర్జన సభ చేపట్టడానికి ముందుకు వచ్చారు.ఇది తెలిసి ఎక్కడ తమ సీటుకు ఎసరు పెడతారని బావించిన ఒక వర్గం బిసి నాయకులు అదే కురువ సామాజిక వర్గం చేత శశికళకు విరుద్దంగా వీడియోలు,ఆడియోలు సోషల్ మీడియాలో పెట్టించి సభను అడ్డుకునేందుకు కుట్రలు పన్నుతున్నారు. ఇటీవల బిసివై పార్టీ నాయకులు రామచంద్రయాదవ్ ఆలూరు, పత్తికొండలో కార్తీక వన భోజన కార్యక్రమాలకు రాకుండా ఆయన హెలిపాడ్‌కు పర్మిషన్ ఇవ్వకండా అధికారాన్ని అడ్డం పెట్టుకొని కొంతమంది నాయకులు సభలను రద్దు చేయించారు.ఈ సారి ఆలూరులో కాలేజి గ్రౌండ్‌లో



కురువ సింహగర్జన పోస్టర్లను విడుదల చేస్తున్న శశికళా మోహన్‌దాస్ దంపతులు

ఏర్పాటు చేయనున్న కురవ మహాసింహగర్జన సభను కూడా జరుగకుండా ఒక నాయకుడు అడ్డుపడుతన్నట్లు తెలుస్తుంది. గతంలో తన సామాజిక వర్గమైన నాయకులను పైకి ఎదగకుండా అనగదొక్కిన సంగ తి ఆలూరు ప్రజలకు తెలిసిన విషయమే. అయితే కురువ మహాగర్జన సభను జరగకుండా సొంత కులభాంధవులే అడ్డుపడుతున్నారు.వారు తమను ఆహ్వానించలేదని చెబుతున్నారు. ఇంతకి బళ్లారి నుండి కురువ కులభాంధవులను ఏకం చేయానికి వచ్చిన శశికళ కృష్ణమోహన్ దంపతులకు అండగా నిలిచేది పోయి సొంత వారే విమర్శలు చేస్తున్నారంటే వారికి పార్టీ అధినేత అంటే అంతభయం ందని అర్ధం.ఒక వైపు శశికళ రాజకీయ పార్టీల నాయకులతో పోరాటం చేస్తూనే మరోవైపు కులసంఘం నాయకులతో భర్త కృష్ణ మోహన్ అండగా సత్యభామ పోరాటం చేస్తుంది.తమకు మాదాసి,మాదారి కులం ఎస్సీ సర్టిఫికేట్ కావాలని అందుకు కురువలంతా ఐక్యమత్యం కావాలని వారు పోరాటం చేస్తుంటే మద్దతు తెలపకపోగా ఎన్నికల ముందు వచ్చారని నిందలు వేస్తున్నారు. రాష్ట్రంలో ఏ కుల సంఘం అయినా లేక ఉద్యోగ సంఘాలు ఐనా ఎన్నికల ముందు నిరసనలు, ధర్నా చేస్తే పాలక పక్షాలు వారి ఓటు బ్యాంకు కోసం వారిహామీలు నెరవేరుస్తారు.అదే రాష్ట్రంలో వివిధ కుల సంఘం నాయకులు తమకు అన్యాయం చేస్తున్నారని సభలు చేస్తే తప్పులేనిది ఆలూరులో కురువ గర్జన సభలు పెడితే రాజకీయం కోసం పెట్టారనడంలోఅర్ధం ఏముంది.ఒకరికి ఒక న్యాయం మరొకరికి ఇంకో న్యాయమా కుల సంఘ నాయకులు కూడా ముందుకు వస్తే వారు కూడా నాయకులుగా ఎదగతారని గుర్తుంచుకోవాలని మొలగవల్లి శశికళ పోరాటంలో సత్యభామను తలపిస్తూ నాయకులు అడుగడుగునా ఆటంకాలు సృష్టించినా మొక్కవోని ధైర్యంతో సభను జరపడానికి సిద్దంగా ఉన్నారు.దానికి వారికి కులభాంధవులు అండగా ఉన్నారనడంలో సందేహం లేదని సంఘం నాయకులు తెలిపారు.



బళ్లారి మాజీ డిప్యూటీమేయర్ మొలగవల్లి శశికళా కృష్ణమోహన్

సూర్య



## మేఘన హత్యపై ఫోర్‌మెన్ కమిటీని నియమించాలి


పీటీ సాయిప్రదీప్

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** మేఘన హత్యపై ఫోర్‌మెన్ కమిటీని నియమించాలని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ ఎస్సీ, ఎస్టీ సభ్యులు పీటీ సాయిప్రదీప్ జిల్లా కలెక్టర్ జి.సృజనను కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిశారు. ఈ సంఘటనపై పోలీసు ఉన్నత అధికారులు వెంటనే స్పందించాలన్నారు. డీవీఎంసీ సభ్యులతో ఫోర్‌మెన్ కమిటీని ఏర్పాటు చేసి వాస్తవాలు సేకరించి బాధితులకు న్యాయం చేయాలని, బాధితురాలు కుటుంబానికి త్వరగా మానిటరింగ్ రిలీఫ్‌ఫండ్ విడుదల చేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.సృజన మాట్లాడుతూ ఫోర్‌మెన్ కమిటీ ఏర్పాటు చేసి బాధితురాలుకు అండగా ఉంటామనానరు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ప్రదీప్, మాజీ సభ్యులు రాజశేఖర్ పాల్గొన్నారు.

## రాష్ట్రంలో అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

– ఇంఛార్జీ క్రాంతినాయుడు


సమావేశంలో మాట్లాడుతున్న క్రాంతినాయుడు

**పత్తికొండ టౌన్, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని కాంగ్రెస్ ఇంచార్జీ బోయ క్రాంతినాయుడు పేర్కొన్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ, ఏపి రాష్ట్రం అభివృద్ధిలోకి రావాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని, ఒక్కసారి అవకాశం ఇవ్వాలని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. 30ఏళ్లుగా టీడీపీ, వైఎస్సార్సిపీలు ఉన్న చేసిందేమి లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే అభివృద్ధి ఏమిటో చూపిస్తామన్నారు. ప్రతి చేతికి కాంగ్రెస్ అంటూ, ఇందిరాక్రాంతి యాత్రలోభాగంగా, పల్లెనిద్ర, పల్లె యాత్ర కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎగ్జిక్యూటీవ్ మెంబరు సోమశేఖర్ గౌడు, మీడియా ఇంచార్జీసలీం, తదితరులు పాల్గొన్నారు.

## ఊట్ల దుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు


పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

**కర్నూలు సిటీ, మేజర్‌న్యూస్:** కార్తీక అమావ్యాసర పర్వదినాన్ని పురస్కరించుకొని కర్నూలు జిల్లా ఉలిందకొండ గ్రామంలో వెలసిన ఊట్ల దుర్గమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. హిందూ ఆలయ ధర్మ పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు విద్యాసాగర్, కర్నూలు జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌సింగ్, సెక్రటరీ కిషోర్‌కుమార్, ఉపాధ్యక్షుడు శ్రీనాథ్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు గంగాధర్ ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ పరిరక్షణకు తమ వంతు సహాయ, సహకారాలు అందిస్తామని వారు తెలిపారు.

## తలముడిపిలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర


పథకాలను వివరిస్తున్న ఎంపీడీఓ జీయన్ఎస్ రెడ్డి

**మిడ్తూరు, మేజర్‌న్యూస్ :** మిడ్తూరు మండల పరిధిలోని తలముడిపి గ్రామంలో కేంద్రం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సంకల్ప యాత్రలో నంద్యాల జిల్లా కలెక్టర్ మనజీర్ జీలాని సమూన్‌ఆదేశాల మేరకు ఎంపీడీఓ జీయన్ఎస్ రెడ్డి మరియు గ్రామ సర్పంచ్ పోగుల వెంకటేశ్వర్లు, జలకనూరు సర్పంచ్ యల్లయ్య అధ్యక్షతన వికసిస్త్ భారత్ సంకల్ప యాత్రను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులందరు పాల్గొని కేంద్ర ప్రభుత్వ సాయోజిత పథకాలు అయిన ఆయిష్మాన్ భారత్, ముద్ర యోజన, సురక్ష భీమా యోజన, జీవన జ్యోతి యోజన, జల మిషన్, పీఎం కిసాన్ కార్డు, పీఎం విశ్వకర్మ యోజన తదితర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ లబ్దిపొందిన వారికి అనుభవాలను సభలో పంచుకోవడం జరిగిందని ఈ యొక్క పథకాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించి ప్రజలకు అత్యంత చేరువలో ఉండాలని ప్రవేశపెట్టారని ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకొని సర్పంచ్ వెంకటేశ్వర్లు అన్నారు. ఈ కార్యక్ర మంలో మండల వ్యవసాయ అధికారి పీరు నాయక్, వెలుగు ఏరియా కోఆర్డినేటర్, దేగలయ్య, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్, రేణుకాదేవి, పంచాయితి కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### సామాజిక తనిఖీ బహిరంగ సభకు

## ప్రతి ఒక్కరు హాజరు కావాలి : ఎంపిడిఓ

**మంత్రాలయం రూరల్, మేజర్‌న్యూస్ :** మంత్రాలయం నియోజకవర్గ కేంద్రంలో స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఈనెల 14న జరిగే ఉపాధిహమీ పథకం సామాజీక తనిఖీ మండల సమావేశానికి ప్రతి ఒక్కరు హాజరు కావాలని ఎంపిడిఓ మణిమంజిరి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హమీ పథకంలో, ఉపాధి హమీ సమన్వయ శాఖలలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులపై డిసెంబర్ 2నుంచి 13వరకు గ్రామాల్లో సామాజీక తనిఖీ నిర్వహించారు. ఈ సామాజీక తనిఖీ 17 గ్రామ పంచాయతీల్లో జరిగింది. గ్రామ బహిరంగ సభలను ఆయా గ్రామాల్లో నిర్వహించారు. ఈనెల 14న ఎంపిడిఓ కార్యాలయంలో బహిరంగ ప్రజావేధిక కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, లబ్దిదారులు హాజరు కావాలని ఆమె పిలుపునిచ్చారు.

## జనరంజక పాలన జగన్‌కే సాధ్యం

– పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి


ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్:** జనరంజక పాలన జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని నన్నూర గ్రామంలో సర్పంచ్ బ్రహ్మయ్య ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి వారికి ప్రభుత్వం నుంచి అందిన లబ్ధి వివరిస్తూ సంక్షేమ క్యాలెండర్‌ను అందజేశారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిన గెలిపించుకొని ముఖ్యమంత్రిని చేసుకుందామని ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తిప్పన్న, జడ్పీటీసీ రంగనాథ్‌గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు చెన్నారెడ్డి, సచివాలయాల జేసీఎస్ కన్వీనర్ లోటరీబాష, తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, ఎంపీడీవో శివనాగప్రసాద్, ఎస్ఐ రాజారెడ్డి, అర్‌డబ్ల్యుఎస్ ఏఈ మురళీక్రిష్ణ, హౌసింగ్ ఏఈ రామయ్య, పంచాయతీరాజ్ ఏఈ రామసుబ్బారెడ్డి, వ్యవసాయాధికారి సుధాకర్, ఎంపీటీసీలు ఫాతిమాబీ, కుసుమలత, పంచాయతీ సెక్రటరీ, వీఆర్వో, సచివాలయ సిబ్బంది, గ్రామ నాయకులు తులసిరెడ్డి, వివిధ గ్రామాల వైసీపీ కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## కరెంటు బిల్లులు తగ్గించాలి

బీజేపీ డిమాండ్


ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

**కోడుమూరు, మేజర్‌న్యూస్:** రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వం ప్రజలను దోపిడీ చేస్తుందని, కరెంటు బిల్లుల పేరుతో, సర్‌చార్జీలు,యూనిట్ల పేరుతో బిల్లుల మీద బిల్లు వేసి ప్రజల నుంచి అత్యధిక రూపాయలు దండుకొని దోపిడీ చేస్తుందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యదర్శి పార్థసారధి, బీజేపీ కోడుమూరు అసెంబ్లీ కన్వీనర్ ప్రేమ్‌కుమార్ విమర్శించారు. కరెంటు బిల్లులు తగ్గించాలని బీజేపీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా హంపయ్య సర్కిల్‌లో భారత్ మాతాజీ జై, మోదీ నాయకత్వం వర్ధిల్లాలి, రైతు ద్రోహి జగన్, పెంచిన కరెంటు ఛార్జీలను వెంటనే తగ్గించానలి అని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. హంపయ్య సర్కిల్ నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా పార్థసారధి, ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం చేసిన తప్పులను ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం చేస్తూ ప్రజలను మభ్యపెడుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 8సార్లు కరెంటు బిల్లులు పెంచిందని ఆరోపించారు. కరెంటు బిల్లులను తగ్గించేదాక బీజేపీ ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గీతామధు, జిల్లా మహిళా మోర్చా కార్యదర్శి మాలతి, అసెంబ్లీ కో-కన్వీనర్ వేల్పులగోపాల్, బీజేపీ ఓబీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళి, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు సురేంద్ర, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, బీజేపీ మండల కార్యదర్శి షణ్ముఖచారి, వర్కూరు కృష్ణ, కోడుమూరు నాయకులు దేవేంద్ర, అశోక్, జట్టప్ప, కార్యకర్తలు పాల్గొన్నారు.

### మార్కెట్‌యార్డు ద్వారా రైతులకు

## అన్ని సదుపాయాలు కల్పిస్తాం :ఎమ్మెల్యే శిల్పా

– మార్కెట్ యార్డు కమిటి సమావేశంలో ఎమ్మెల్యే శిల్పా


ఎమ్మెల్యే శిల్పాకు స్వాగతం పలుకుతున్న మార్కెట్ యార్డు చైర్మన్, వైస్ చైర్మన్, సెక్రేటరి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** వ్యవసాయ మార్కెట్‌యార్డు పరిధిలోని రైతులందరికి యార్డు ద్వారా అన్ని సదుపాయాలు కల్పించి రైతులకు మేలు చేకూరేలా మార్టెయార్డును తీర్చిదిద్దుతానని శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో కమిటి సభ్యులతో సాదారణ సమావేశాన్ని నిర్వహించగా ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శిల్పా హాజరయ్యారు. శిల్పాకు మార్కెట్ యార్డు చైర్మన్ బాలస్వామి యాదవ్, అబ్దుల్ రషీద్ , సెక్రేటరి శ్రీనివాసులు పుష్పగుచ్చంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శిల్పా మాట్లాడుతూ నియోజవర్గంలోని రైతుల సమస్యలపై స్పందించి ఎప్పటికప్పుడు పరిష్కరించడంతో జరిగిందన్నారు. రైతులకు ఉపయోగకరంగా మార్కెట్ యార్డు రూపురేఖలు మార్చడం జరిగిందన్నారు. రైతులకు సబ్సీడి ద్వారా ఎరువులు, విత్తనాలు అందించి పంటసాగు అవసరమైన సాగునీటిని అందించడం జరిందన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం జరిగిందన్నారు. రైతులకు ఎంతో ఉపయోగపడే విధంగా మార్కెట్‌యార్డును అభివృద్ధి చేసి ఆదర్శ యార్డుగా తీర్చిదిద్దుతామని అన్నారు. అనంతరం సమావేశంలో పలు అజెండాలను ఏకగ్రీవంగా ఆమోదించం జరిగింది. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

– తహశీల్దార్ కార్యాలయం వద్ద

సమ్మె చేపట్టిన అంగన్‌వాడీ సిబ్బంది

**బండి ఆత్మకూరు రూరల్, మేజర్‌న్యూస్ :** రాష్ట్రవ్యాప్తంగా వున్న అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బండి ఆత్మకూరు మండల అంగన్ వాడీ కార్యకర్తలు తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్‌వాడి కార్యకర్తల సభ్యులు రమణమ్మ, శ్యామల, వసంత, ఆనందమ్మలు మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల నుండి ప్రభుత్వానికి వివిధ రూపాలలో తమ సమస్యలు పరిష్కారం కోసం వినతులు ఇచ్చినప్పటికీ ప్రభుత్వం నుండి స్పందన లేకపోవడంతో సమ్మె బాట పట్టామని తెలిపారు. వైయస్‌ఆర్ సంపూర్ణ పోషణ పథకాన్ని నిర్వహించడానికి సరుకుల ధరలు పెరుగుతున్నా అందుకు తగ్గట్లు నిధుల కేటాయింపు లేదని ఇప్పటి వరకు తమ జీతం పెంచలేదని పక్క రాష్ట్రంలో జీతాలు పెంచారని గుర్తుచేశారు. హెల్పర్ల వేతనాలు గ్రాడ్యూటి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని తెలిపారు. కనీస వేతనాలు డీఏ, ఇతర అలవెన్స్‌లు ఇచ్చి తమను ఆదుకోవాలని సూచించారు. గతంలో అంగన్‌వాడి సిబ్బందికి ఇచ్చే వితంతు పించన్, వికలాంగు పించన్ ఈ ప్రభుత్వం తీసివేసిందని ఎటువంటి పరిమితులు విధించకుండా తమ కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందజేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. అంగన్‌వాడి చేస్తున్న నిరవధిక సమ్మెకు వ్యవసాయ కార్మిక సంఘం రత్నమయ్య, వివిధ వామపక్ష సభ్యులు మద్ధతు తెలిపారు. సాయంత్రం అంగన్‌వాడి కార్యకర్తలు, వర్కర్లు ర్యాలీగా వెళ్లి ఎంపీడీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డికి వినతిపత్రం అందజేసి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు.

### అభయాంజనేయునికి

## ప్రత్యేక పూజలు

**బండి ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** కార్తీక అమావాస్య సందర్భంగా మండలంలోని పెద్ద దేవలాపురం గ్రామ సమీపంలో వెలసివున్న శ్రీ ఏకశిలా అభయాంజనేయ స్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసంతో పాటు, కార్తీక అమావాస్య కావడంతో జిల్లాలోని వివిధ గ్రామాల నుండే కాకుండా పక్క జిల్లాల నుంచి కూడా భక్తులు పెద్ద ఎత్తున వచ్చి శ్రీ ఏకశిలా అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమలపాకులతో స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. స్వామి వారి ఆలయంలో మెట్ల పూజ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భజన కార్య క్రమం, చిన్నారులతో కోలాటం నిర్వహించారు. స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులకు ఆలయ కమిటి నిర్వాహకులు శివరాజ్ నాయక్ భోజన వసతి కల్పించారు.

# శ్రీశైల దేవస్థానం ధర్మకర్తల మండలి సమావేశం

**-30 అంశాలు ప్రతిపాదించగా 28 అంశాలు ఆమోదం**

**శ్రీశైలం, మేజర్‌న్యూస్:** శ్రీశైల దేవస్థానం ధర్మకర్తల మండలి సమావేశాన్ని మండలి అధ్యక్షులు రెడ్డివారి చక్రపాణి రెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఆలయ ఈవో డి.పెద్దిరాజు సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో 30 అంశాలను ప్రతిపాదించగా 28 అంశాలను ఆమోదించి ఒక్క అంశాన్ని వాయిదా వేసి మరొక అంశాన్ని తిరస్కరించారు.సభ్యులు మఠం విరూపాక్షయ్యస్వామి, జి.నరసింహారెడ్డి, ఎం.విజలయక్ష్మి, బి.రామేశ్వరి, ఎ.లక్ష్మీసావితమ్మ, ఆలకుంటగారి మురళి, మేరాజోత్ హనుమంతునాయక్. ఓ.మధుసూదన్ రెడ్డి, డా.కనకదుర్గ, ప్రత్యేక ఆహ్వానితులు తన్నీరు ధర్మరాజు పాల్గొన్నారు. అదేవిధంగా దేవస్థానం యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు పాల్గొన్నారు.

**ధర్మకర్తల మండలి సమావేశపు ముఖ్య నిర్ణయాలు**

– శ్రీ శిఖరేశ్వరస్వామివారి ఆలయ ప్రహారీగోడను పెంచి బండపరుపు తదితర అభివృద్ధి పనులు అంచనా వ్యయం రూ.39 లక్షలు

– శిఖరేశ్వర ఆలయం వద్ద ఆర్చ్ గేట్ నిర్మించి సిమెంట్ కాంక్రీట్ రోడ్డు అంచనా వ్యయం రూ.10 లక్షలు



– అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా శ్రీశైలక్షేత్రపరిధిలో పలుచోట్ల సిమెంట్ కాంక్రీట్ రోడ్డు అంచనా వ్యయం రూ.29 లక్షలు

– భక్తుల వసతి సౌకర్యార్థం గణేశ సదనము సమీపంలో నిర్మించ తలపెట్టిన 200 గదుల వసతి నిర్మాణపు పనుల అమోదం. ఈ నిర్మాణపు అంచనా వ్యయం రూ.52 కోట్లు

– క్షేత్రపరిధిలో ట్రాఫిక్,పార్కింగు సమస్యలను అధిగకమించేందుకు టోలేట్,నందిసర్కిల్ మొదలైనచోట్ల ప్రీకాస్ట్ సెంటర్ డివైడర్లు ఏర్పాటు చేయుటకు ఆమోదం తెలుపడం జరిగినది. అవసరమైన సందర్భాలలో ఈ డివైడర్లను వేరొక ప్రదేశాలకు మార్పు చేసే అవకాశం కూడా ఉంటుంది.అంచనా వ్యయం రూ.38.50 లక్షలు

– ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకు రాజుల సత్రం కూడలి నుండి సిద్ధరామప్ప పాదాల వరకు (కొండలోయకు ఇటునుండి అటువైపుకు) బ్రిడ్జి నిర్మించాలన్న ప్రతిపాదనను ఆమోదించడమైనది.

– మల్లికార్జునసదన్ నుండి టోల్ గేట్ వరకు,టోల్ గేట్ నుంచి రామయ్య టర్నింగ్ వరకు ఫ్లై ఓవరు బ్రిడ్జి ఏర్పాటు ప్రతిపాదనను ఆమోదించడమైనది.

– ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు ప్రమాదాలను నివారించేందుకు సిద్ధిరామప్ప
వంపు మూల( జంక్షన్) వద్ద రహదారిని విస్తరించేందుకు ఆమోదము తెలపనైనది.అంచనా వ్యయం రూ.15.50 లక్షలు

– రాబోవు మహాశివరాత్రి,ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని ఆయా సివిల్, ఎలక్ట్రికల్,జనరల్ పనులను చేపట్టుటకుగాను ఆమోదము తెలుపనైనది.అంచనా వ్యయం రూ. 10,53,85,000

– కల్యాణకట్టలో పలు మరమ్మతులు,అభివృద్ధి పనులు చేపట్టుటకు ఆమోదం తెలుపబడినది.అంచనా వ్యయం రూ.13 లక్షలు

– క్షేత్ర ప్రచారంలో భాగంగా స్థలపురాణం, చరిత్ర, క్షేత్ర ప్రత్యేకతలు మొదలైన అంశాలు పొందుపరుస్తూ ఆయా చిత్రాలతో కాఫీటేబుల్ బుక్కును ప్రచురించేందుకు ఆమోదం

**శ్రీ మద్దిలేటి స్వామి క్షేత్రాన్ని**

# జిల్లాలోనే పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి : బుగ్గన

**- రూ.50 కోట్లతో శ్రీ మద్దిలేటి నరసింహ స్వామి క్షేత్రాభివృద్ధి**

**- ఆర్.ఎస్ రంగాపురంలో నిర్మించే**

**ఆలయ ముఖ ద్వార పనులు పరిశీలన**



**బేతంచెర్ల, మేజర్‌న్యూస్ :** శ్రీ మద్దిలేటి స్వామి క్షేత్రాన్ని జిల్లాలోనే ప్రముఖ,పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చేస్తున్నామని ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆర్.ఎస్ రంగాపురం గ్రామంలో రూ.2.75 కోట్లతో నిర్మిస్తున్న శ్రీ మద్దిలేటి స్వామి ముఖ ద్వారా నిర్మాణ పనులను ఆలయ అధికారులతో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.50 కోట్లతో శ్రీ మద్దిలేటి నరసింహస్వామి క్షేత్రాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో అభివృద్ధి చేస్తుండడం, జాతీయ నిర్మాణం చేపడుతుండడం వల్ల రహదారిని ఆనుకుని ఉన్న దుకాణదారుల ఉపాధికి ఎటువంటి ఇబ్బందులు ఉండవని మంత్రి బుగ్గన భరోసా ఇచ్చారు. దైవ కార్యమైన ఆలయ ముఖద్వార స్తంభాలను ఏర్పాటు చేయడంలో భాగంగా ఇప్పటికే సామాగ్రిని సిద్ధం చేసుకున్న నేపథ్యంలో త్వరితగతిన ఆ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. స్వామి వారి ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని తద్వారా స్థానికులు, దుకాణదారులకు లాభమే తప్ప నష్టముండదని మంత్రి బుగ్గన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మద్దలేటి స్వామి ఆలయ ఈవో డి. పాండురంగా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు రక్షణ కరువైంది


మాట్లాడుతున్న కె.పార్వతమ్మ

**కల్లూరు, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌లో మహిళల మాన, ప్రాణాలకు రక్షణ కరువైందని నంద్యాల పార్లమెంటు టీడీపీ మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మ అన్నారు. రాష్ట్రంలో ఆడబిడ్డ అంటే కోడి పిల్లలగా ఒంటరిగా ఉందన్నారు. ముఖ్యమంత్రి బటన్ నొక్కడానికే సరిపోయిందన్నారు. ఏపీలో నేరాలు అధికంగా చోటు చేసుకుంటున్నాయన్నారు. రాష్ట్రంలో మహిళలు, బాలలు, వృద్ధులపై నేరాలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. దిశా చట్టం అమలు ఎక్కడా కనిపించడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి మహిళలు తగిన బుద్ధి చెప్పాలన్నారు.

## 14న దళిత శంఖారావం సభను జయప్రదం చేయండి

**బేతంచెర్ల, మేజర్‌న్యూస్ :** 14 న నంద్యాలలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగే దళిత శంఖారావం సభను జయప్రదం చేయాలని జిల్లా ఎస్సి సెల్ అధ్యక్షులు కొమ్మలపాటి రాజారావు,జిల్లా కార్యదర్శి మెట్ల భాస్కర్,రాష్ట్ర క్రిస్టియన్ కార్యదర్శి మేకల నాగరాజులు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో నిత్యం దళితులపై జరుగుతున్న దాడులు, హత్యలు, హత్యాచారాలు ధమనకాండలకు మరియు దళిత వ్యతిరేఖ నిర్ణయాలకు నిరసనగా తెలుగు దేశం పార్టీ ఆధ్వర్యంలో శంఖారావం నిర్వహిస్తున్నమని కావున ఆయా విభాగాలలోని ప్రతినిధులు పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి రూబిన్, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి రవీంద్ర నాయక్, కౌన్సిలర్ రాంగోపాల్, మండల ఐ టి డి పి అధ్యక్షుడు మాధవ్, పట్టణ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు శ్రీపతి నాగరాజు, కానాల అంజి తదితరులు పాల్గొన్నారు.

## దళితుల అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం : టిడిపి

**బేతంచెర్ల, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో దళితుల అభివృద్ధి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు పోలూరు వెంకటేశ్వర రెడ్డి,నియోజకవర్గ యువ నాయకులు మన్నే గౌతమ్ రెడ్డి అన్నారు.మంగళవారం నగర పంచాయతీ 14 ,16 వార్డులో బాబు షఉరిటీ– భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం వార్డులో పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్షవాలి చౌదరి,మండల కన్వీనర్ ఉన్నాం ఎల్లా నాగయ్య, నాయకులు మేకల నాగరాజు, రూబెన్, రామ్ గోపాల్,ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే తెలుగుదేశం పార్టీ దళితుల కోసం ప్రవేశపెట్టిన 27 సంక్షేమ పథకాలను రద్దుచేసి దళిత ద్రోహిగా మిగిలారని అన్నారు.వచ్చే ఎన్నికల్లో సైకో జగన్ కు ప్రజలు తమ ఓటు హక్కుతో తగిన గుణపాఠం చెప్పాలని కోరారు.ఈ కార్యక్రమంలో తిరుమలేష్ చౌదరి,ఉన్నాం చంద్రశేఖర్ ,మాజీ ఎంపీటీసీ జాకీరుల బేగ్, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి రవీంద్ర నాయక్, వంశీకృష్ణ, లోకేష్ గౌడ్, సిమెంట్ నగర్ రాముడు, వినయ్ చౌదరి, అరుణ్ కుమార్ , అంజి మహిళా అధ్యక్షురాలు మేకల నలిని, మేకల నీతమ్మ, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**అంగన్‌వాడీల వేతనాల పెంపుకు**

## నిరవధిక సమ్మె

**నంద్యాలనూనెపల్లె, మేజర్‌న్యూస్:** రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ వర్కర్లు ఆయాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ గత నాలుగున్నర సంవత్సరాలు పాటు అనేక పోరాటాలు చేసినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం లేదని ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ ఈనెల 12వ తేదీ నుంచి నిరవధిక సమ్మె పిలుపులో భాగంగా తహశీల్దార్ దగ్గర సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మెలో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు తోటమద్దులు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, గౌస్‌లు మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు, సున్నా నుంచి 6 సంవత్సరాల లోపు పిల్లలకు అంగన్‌వాడీ వర్కర్లు, మినీ వర్కర్లు, హెల్పర్లు, అనేక సేవలందిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతనాలు చెల్లించడం లేదన్నారు. నిత్యావసర సరుకుల ధరలు పెరిగినా వేతనాలు పెరగడం లేదన్నారు. అంగన్‌వాడీ సెంటర్ల నిర్వాహణకు సంబంధించిన బిల్లులన్నీ సకాలంలో చెల్లించక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అంగన్‌వాడీ సెంటర్ల నిర్వహణకు వివిధ రకాల యాప్‌లు తెచ్చారు. ఫోన్లు పనిచేయడం లేదు. ఏ ట్రైనింగ్ ఇవ్వడం లేదన్నారు. దీనివల్ల అంగన్‌వాడీలు మానసిక వత్తిళ్ళకు గురిచేస్తున్నారన్నారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఆయాలంతా లబ్దిదారులను ఐక్యం చేసుకుని సమ్మె విజయవంతానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

## బారికేడ్లు విరాళం

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్:** హైదరాబాద్‌కు చెందిన ఎంఎస్ స్టీల్‌పైప్స్ మహాలక్ష్మి ప్రొఫిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కర్నూలు పోలీసులకు రూ.6లక్షలు విలువ చేసే బారికేడ్లు అందజేశారు. ఆ కంపెనీ చైర్‌పర్సన్ రాంనిరంజన్, డైరెక్టర్ వినోద్ అగర్వాల్, బ్రాండ్‌మేనేజర్ కార్తీక్, ఏరియా సేల్స్ ఆఫీసర్ మహబూబ్‌బాష వీటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కర్నూలు సబ్‌డివిజన్ డీఎస్పీ విజయశేఖర్, వన్‌టౌన్, టుటౌన్, ఫోర్త్‌టౌన్ సీఐలు పాల్గొన్నారు.

# సమస్యలు పట్టించుకోరు... ప్రోటోకాల్ పాటించరు

**– మున్సిపల్ అధికారుల తీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు**

**– కేరళా విజ్ఞాన టూర్ బాయ్‌కాట్ చేసిన కౌన్సిలర్ ఖండే శ్యాంసుందర్ లాల్**

**– కౌన్సిల్‌లో సమస్యలు విన్నవించినా అధికార పక్షం నో కామెంట్**


స్వతంత్ర కౌన్సిలర్ ఖండే శ్యాంసుందర్‌లాల్

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్:** తన వార్డులో ఉన్న సమస్యలను కౌన్సిల్‌లో ఎన్నోసార్లు గళమెత్తినా అంతేగా అనే తంతుగా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని...అలాగే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడపగడప కార్యక్రమాలకు అధికారులు ప్రోటోకాల్ పాటించకుండా నిర్లక్ష్యం వ్యవహరించడంపై 12వ వార్డు స్వతంత్ర కౌన్సిలర్ ఖండే శ్యాంసుందర్‌లాల్ అధికారుల తీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సాగిస్తున్న గడపగడప ప్రభుత్వ కార్యక్రమం తన వార్డులో జరుగుతున్నా పిలవకపోవడం బాధాకరమన్నారు. ప్రజల చేత ఎన్నుకోబడిన నన్ను పిలకకపోవడం ప్రజలను అవమానించినట్లే అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు జగనన్న సురక్ష, ఆరోగ్య సమస్యలకు సంబంధించిన కార్యక్రమాలకు ఫోన్ చేసి పిలవడంతో నా బాధ్యతగా అన్ని కార్యక్రమాలు విజయవంతం చేశానని అన్నారు. అందుకే కౌన్సిలర్లు అందరూ కేరళకు వెళుతున్న విజ్ఞాన యాత్రను బాయ్‌కాట్ చేస్తున్నట్లు ప్రకటించారు. మున్సిపల్ అధికారులు పిలవకపోవడానికి ప్రధాన కారణం నా వార్డులో సమస్యలు ఎక్కువ ఉండటమే అన్నారు. 12వ వార్డులో కోట్లు విలువ చేసే భవనాలు కట్టుకోవడానికి అనుమతులు ఇస్తారు కాని రోడ్లు వేయడానికి, కాల్వలు నిర్మించడానికి ఉత్సాహం చూపరన్నారు. అభివృద్ధి పనుల టెండర్లు ఒకే చేసినా పనులు జరగవని ఆరోపించారు. లక్షల ఆదాయం వచ్చే ఎన్‌టిఆర్ కాంప్లెక్స్ నిరాదరణకు గురవుతోందని కౌన్సిల్‌లో పలుమార్లు ప్రస్తావించినా ఫలితం శూన్యమన్నారు. ఎన్‌టిఆర్ కాంప్లెక్స్ అభివృద్ధి చేస్తే నాలుగు రెట్లు ఆదాయం వస్తుందని చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. గడప గడపకు ప్రభుత్వంలో తన వార్డు సమస్యలకు జవాబు చెప్పాల్సి వస్తుందని కార్యక్రమాలకు పిలవకపోవడంతో అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. అందుకే తాను విజ్ఞాన యాత్రను బాయ్‌కాట్ చేస్తున్నట్లు ప్రకటించారు. కళ్ళముందే కనిపిస్తున్న సమస్యలు పరిష్కరించలేకపోతున్న అధికారులు ఎక్కడో అభివృద్ధిని చూపి అభివృద్ధి చేశామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.

## కొనసాగుతున్న న్యాయవాదుల రిలే నిరాహార దీక్షలు


దీక్షల్లో కూర్చున్న న్యాయవాదులు

**కర్నూలు లీగల్, మేజర్‌న్యూస్:** భూయాజమాన్య చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ కర్నూలు నగరంలో న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహారదీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం 2వరోజు దీక్షల్లో క్రిష్ణ, పాపన్న, మనోహర్, రాజు, సురేష్‌కుమార, ధనారెడ్డి, బి.శ్రీనివాసులు కూర్చున్నారు. ఈ సందర్భంగా రవికుమార్, ఓంకార్‌యాదవ్, మురళిమోహన్, వెంకటస్వామిలు మాట్లాడుతూ వెంటనే 512జీవోను ప్రభుత్వం రద్దు చేయాలన్నారు. ఈ జీవో చిన్న, సన్నకారులు రైతులకు అన్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది చంద్రుడు, బార్‌అసోసియేషన్ కార్యదర్శి చక్రపాణి, ఆంజనేయులు పాల్గొన్నారు.

# అహోబిలేశునికి అమావాస్య పూజలు


అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలంలో మంగళవారం శ్రీలక్ష్మీ నరసింహ స్వామికి అమావాస్య పూజలు ఘనంగా జరిగాయి. ఉత్సవ మూర్తులైన శ్రీ ప్రహ్లాద వరద స్వామి శ్రీదేవి భూదేవి అమ్మవార్లకు అమావాస్య సందర్భంగా తిరుమంజనం నిర్వ హించారు. ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు, అర్చక బృందం వేదమం త్రాల మధ్య తిరుమంజనం నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా పట్టు వస్త్రాలు పూలమాలతో అలంకరించి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# బహుళ ప్రయోజనాల భవన నిర్మాణాలను వేగవంతంగా నిర్మించండి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి :** బహుళ ప్రయోజనాల నిర్మాణాల భవనాలు వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.సృజన సంబంధితాధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి కో-ఆపరేటివ్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాకు మంజూరైన 102 బహుళ ప్రయోజనాల భవన నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అయితే ఇప్పటి వరకు కేవలం 35మాత్రమే పూర్తి చేశారన్నారు. 18వతేదీనాటికి మరో 35 భవన నిర్మాణాలు పూర్తి కావాలన్నారు. 25వతేదీ నాటికి బేస్‌మెంట్ స్థాయిలో ఉన్న మిగతా గోదాములు పూర్తి చేసి రైతులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ డీఈని ఆదేశించారు. సీసీఆర్సీ కార్డుల ద్వారా కౌలు రైతులకు రుణాలు మంజూరుచేసేలా చర్యలు తీసుకోవాలని జేసీ నారపురెడ్డి మౌర్య డీసీఓను ఆదేశించారు. ఈ సమావేశంలో డీసీఓ రామాంజనేయులు, కేడీసీసీ బ్యాంక్ సీఈవో రామాంజనేయులు, జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి, మార్కెటింగ్ ఏడీ నారాయణ మూర్తి, జిల్లా హార్టికల్చర్ అధికారి రామాంజనేయులు, మార్కెటింగ్ ఇంజనీర్లు, ఓర్వకల్లు, పసుపల, ఉల్చాల సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

# అభివృద్ధి చేస్తే అక్రమ కేసులా - మాజీ ఎమ్మెల్యే బీసీ

**- రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేసిన వైనం**

**బనగానపల్లెమేజర్,న్యూస్:** అభివృద్ధి చేస్తే అక్రమ కేసులు పెడతారా అని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి ప్రశ్నించారు. బనగానపల్లె పట్టణంలో షాదీఖాన నిర్మాణానికి సంబంధించి అభివృద్ధి పనులు మొదలు పెడితే అధికారులు తనపై అక్రమ కేసులు పెట్టడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. పాతబస్టాండు సమీపంలో ఆయన ముస్లీం మైనార్టీ సోదరులతో కలిసి రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమ కేసులతో తనను ఆపలేరని ఇలాంటి కేసులకు భయపడే ప్రసక్తే లేదని తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ముస్లీం మైనార్టీల వివాహాలు మరియు కుటుంబంలో ఏమైనా శుభకార్యాలు చేసుకోవడానికి సరైన షాదీఖాన లేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో తన సొంత డబ్బును 30లక్షల రూపాయలు వెచ్చించి మరో 70లక్షల రూపాయలతో షాదీఖాన నిర్మాణాన్ని మొదలు పెట్టడం జరిగిందని దాదాపుగా 70శాతం పనులు పూర్తి అయ్యాక ప్రభుత్వం మారడంతో దానిని ఎమ్మెల్యే పట్టించుకోకపోగా తాను సొంత నిధులతో అభివృద్ధి చేస్తుంటే అడ్డుకోవడం న్యాయం కాదన్నారు. నాలుగున్నర సంవత్సరాల కాలంపాటు షాదీఖానకు సంబంధించిన ఎటువంటి పనులు చేయని ఎమ్మెల్యే కేవలం ప్రజలను మభ్యపెట్టేందుకే సాయినగర్‌లో షాదీఖాన నిర్మాణం అంటూ తెరపైకి తీసుకువచ్చారన్నారు. అక్కడ షాదీఖాన కట్టినప్పటికీ ఊరు మధ్యలో ఉన్న షాదీఖాన నిర్మాణానికి అధికారులు సహకరించాలని కలెక్టర్‌ను కూడా కలిసి వినతిపత్రం అందించ చడం జరిగిందన్నారు. అయితే కాలం గడుస్తున్నా వారు పట్టించుకోకపోవడంతోట తానే స్వయం గా షాదీఖాన నిర్మాణానికి పనులు ప్రారంభించామన్నారు. అయితే నాడు సహకరిస్తారన్న కలెక్టర్, అధికారులు నేడు తనపై కేసులు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. గతంలో ఇండ్ల పట్టాలకు సంబంధించి కూడా తనపై ఎమ్మెల్యే తప్పుడు అభియోగాలను మోపుతూ తప్పుడు ప్రచారాలను చేస్తున్నారన్నారు. అధికారులు వచ్చి సమాధానం చెప్పేంత వరకు తన పోరాటం ఆగదన్నారు. అయితే బనగానపల్లె సి.ఐ తిమ్మారెడ్డి, పోలీసు అధికారులు బీసీ జనార్ధన్ రెడ్డితో చర్చలు జరిపి వారిని నిరసన నుండి విరమింపజేశారు. అయితే ఈ షాదీఖాన నిర్మాణం విషయంలో తాను వెనక్కి తగ్గేదేలేదని మరోసారి మాజీ ఎమ్మెల్యే తెలిపారు. అధిక సంఖ్యలో ముస్లీం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.


రోడ్డుపై బైఠాయించిన మాజీ ఎమ్మెల్యే బీసీ

# ఒత్తిడిని అధిగమించేందుకు యోగా సాధన చేయాలి

**- రాజ్యసభ మాజీసభ్యులు టీజీ వెంకటేష్**

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్:** ఒత్తిడిని అధిగమించేందుకు యోగ సాధన చేయాలని రాజ్యసభ్య మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. కర్నూలు నుంచి అంతర్జాతీయ యోగా పోటీలకు క్రీడాకారులు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. మంగళవారం నగరంలోని తన స్వగృహంలో అంతర్జాతీయ యోగా పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో మానసిక ఒత్తిడి అధిగమించేందుకు యోగా సాధన వైపు అడుగులు వేయాలన్నారు. ప్రస్తుతం ప్రధానమంత్రి నరేంద్రమోడీ నేతృత్వంలో ప్రపంచ దేశాలు యోగా వైపు అడుగులు వేస్తూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తయారవుతున్నారన్నారు. జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణిస్తుండటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో యోగా శిక్షకులు అవినాష్‌శెట్టి, మునిస్వామి, ప్రసన్న, శశిధర్ పాల్గొన్నారు.

**అంతర్జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైన క్రీడాకారులు :** ఎస్.ప్రసన్న 25-30విభాగంలో, మునిస్వామి 25-30విభాగంలో, ఎం.మనీషా09-12 విభాగంలో, గురుప్రీతి 09-12విభాగంలో, మనుశ్రీ09-12 విభాగంలో, వలనాట మనస్విని 12-15 విభాగంలో జిల్లా తరఫున పోటీ చేయనున్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న టీజీ వెంకటేష్

# ముస్లింలు బాగుపడాలంటే టీడీపీ ప్రభుత్వం రావాలి..టీజీ భరత్

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:**

తెలుగుదేశం ప్రభుత్వం వస్తే ముస్లింలకు ఎంతో మేలు జరుగుతుందని కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి టీజీ భరత్ అనానరు. మంగళవారం నగరంలోని మౌర్య ఇన్‌లోని పరిణయ ఫంక్షన్ హాల్‌లో సమావేశం ఏర్పాటు చేసి మైనార్టీ నగర కమిటీ ఆయన ప్రకటించారు. నగర అధ్యక్షుడిగా అబ్దుల్‌హమీద్, ఉపాధ్యక్షులుగా జుబేర్‌అలీఖాన్, అబ్దుల్‌రజాక్, షేక్‌ఇమ్రాన్, సలీం, మహమ్మద్ మున్షాఖాన్, ప్రధాన కార్యదర్శి మెహబూబ్‌బాషలతోపాటు 20మంది కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారికి నియామక పత్రాలు అందజేశారు. అనంతరం టీజీ భరత్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వీధుల్లోకి వెళ్లి మహిళలు, యువతలో చైతన్యం తీసుకరావాలన్నారు. అందరం కష్టపడితేనే ఫలితం ఉంటుందన్నారు. టీడీపీ వస్తే ఉద్యోగాలు వస్తాయని, అందరికీ పని దొరుకుతుందన్నారు. కర్నూలులో తాను ఎమ్మెల్యేగా గెలిస్తే గతంలో ఎన్నడూ లేని డెవలప్‌మెంట్ చేస్తానని తెలిపారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు టీజీ భరత్‌ను గజమాలతో తస్కరించారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు నాగరాజుయాదవ్, ప్రధాన కార్యదర్శి జహంగీర్‌బాష, సీనియర్ నేతలు మన్సూర్‌అలీఖాన్, అబ్బాస్, మెహబూబ్‌ఖాన్, ఇబ్రహీం పాల్గొన్నారు.


టీడీపీ మైనార్టీ నూతన కమిటీతో టీజీ భరత్

**- ఆలయాల్లో కార్తీక అమావాస్య పూజలు**
**- శివనామస్మరణలతో మార్మోగిన ఆలయాలు**

# వైభవంగా శివపార్వతుల కళ్యాణోత్సవాలు

**నంద్యాలకల్చరల్,మేజర్‌న్యూస్:** కైలాసమే దిగివచ్చిందా..ఆ శివయ్య గణాలు..దేవతలు భూలోకానికి వచ్చి శ్రీశివపార్వతుల కళ్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారా అన్నట్లుగా పట్టణంలోని శివాలయాల్లో కార్తీక అమావాస్య పురస్కరించుకుని బసవేశ్వరుని సాక్షిగా శ్రీశివపార్వతుల కళ్యాణోత్సవం అత్యంత వైభవంగా కొనసాగింది. కోరిన కోరికలు తీర్చే ఆ పరమాత్ముడిగా భోళాశంకరుడిగా చుక్క నీరు పోసినా..ఒక బిల్వపత్రం సమర్పించినా చాలు కరుణించే శివయ్యకు భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని ఆలయాలు శివనామస్మరణలతో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. మంగళవారం కార్తీక మాస చివరి రోజు అమావాస్య సందర్భంగా పట్టణంలోని బైర్మల్ వీధిలో వెలసిన శ్రీబసవేశ్వరస్వామి ఆలయంలో ఆలయ శాశ్వత ధర్మకర్తలు భద్రిశెట్టి అమర్‌నాథ్, భద్రిశెట్టి శివానంద ప్రసాద్ కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో బసవేశ్వరస్వామి శివపార్వతుల కళ్యాణోత్సవానికి ముందుగా ఉండి నడిపించిన విధంగా బసవేశ్వరస్వామిని అత్యంత అందంగా ముస్తాబు చేయగా శివపార్వతులు పెళ్లిపీటలపై ఆశీనులు కాగా శివపార్వతుల గణాలుగా భక్తులు స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవాన్ని భక్తిపారవశ్యంతో తిలకించారు. స్వామి అమ్మవార్ల పెళ్లి పంతులుగా బసవేశ్వరస్వామి ఆలయ అర్చకులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ వీరశైవ ఆగమ సలహాదారులు శశిభూషణ సిద్ధాంతి ఆచార్యత్వంలో వేద మంత్రోచ్ఛారణలతో భాజా భజంత్రీలు మోగుతుండగా స్వామివారు అమ్మ వారి మెడలో తాళికట్టే దృశ్యం అత్యంత అద్భుతంగా భక్తులు కనులారా వీక్షించారు. పెళ్లితంతు ముగిసే వరకు భక్తులు ఎంతో భక్తితో తిలకించి ధన్యులయ్యారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. అలాగే పట్టణంలోని ఎన్‌జీఓ కాలనీలో వెలసిన శ్రీఅమర లింగే శ్వర స్వామి ఆలయంలో దివంగత అవల పరిపూర్ణ యోగా నంద స్వామి తనయుడు యోగానంద్ ఆధ్వర్యంలో స్ఫటిక లింగేశ్వరునికి తెల్లవారుజామున అభిషేకాలు, మహాన్యాస రుద్రాభిషేకాలు నిర్వహించి శివపార్వతుల కళ్యాణోత్సవం నిర్వహించారు. విశ్వనగర్‌లోని శ్రీగాయత్రీ విశ్వకర్మ దేవాలయంలో కార్తీక అమావాస్య పురస్కరించుకుని దేవాలయ వ్యవస్థాపక అధ్యక్షులు విశ్వరూపాచారి విజయలక్ష్మీ దంపతుల ఆధ్వర్యంలో మట్టితో తయారు చేసిన శివలింగానికి లక్ష బిల్వార్చన, సహస్రపుష్పాలంకరణ చేసి సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. నందులలో ఒకటైన ప్రథమనందీశ్వర స్వామి ఆలయంలో శ్రీప్రథమనందీశ్వరుడిని పూలాలంకరణలో ముస్తాబు చేశారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుడిపాటిగడ్డలో వెలసిన శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయం, శ్రీబ్రహ్మానందీశ్వరస్వామి ఆలయాల్లో స్వామి వారికి రుద్రాభిషేకాలు, మహాన్యాస పూర్వక ఏకాదశ అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం ఆయా ఆలయాల నిర్వాహ కులు శివపార్వతులను పల్లకీలో ఆశీనులను చేసి ఊరేగింపుగా పట్టణంలోని పురవీధుల గుండా భక్తుల దర్శనార్థం తరలివెళ్లారు. భక్తులు తమ ఇష్టదైవానికి కాయకర్పూరం సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.


శ్రీబసవేశ్వరస్వామి ఆలయంలో శ్రీశివపార్వతుల కళ్యాణోత్సవం


మట్టితో తయారు చేసిన పరమేశ్వరుడికి లక్ష బిల్వార్చన చేస్తున్న మహిళలు


దీపాల వెలుగులో శ్రీ స్ఫటిక లింగేశ్వరస్వామి